విశాలాంధ్ర

ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

గురువారం 05 సెప్టెంబరు 2024   8 పేజీలు

ముంచుకొస్తున్న ముప్పు...!

- అస్నా అల్పపీడనం హెచ్చరికలతో భయాందోళనలో ప్రజలు
- కొల్లేరును ముంచెత్తుతున్న వరద నీరు
- సహాయక చర్యల్లో జిల్లా యంత్రాంగం

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : గత నాలుగు రోజుల క్రితం నుండి ప్రకృతి కన్నెరచేసి వరదలు ముంచెత్తి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న జిల్లా వాసులకు ఉపద్రవంలాగా మరొక ముప్పు పొంచి ఉంది. మరో 24 గంటల పాటు జిల్లాలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం హెచ్చరికలతో జిల్లా ప్రజలు ఉలిక్కి పడుతున్నారు. బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడబోతుందన్న వాతావరణ కేంద్ర హెచ్చరికలు ఇటు అధికార యంత్రాంగాన్ని అటు ప్రజలను తీవ్ర భయాందో ళనకు చేస్తున్నది. ఇప్పటికే జిల్లాలోని కుక్కునూరు, వేలేరుపాడు, పోలవరం, బుట్టాయిగూడెం, చింతలపూడి, నూజివీడు, పెదవేగి, పెదపాడు మండలాలు వరద తాకిడికి అతలాకుతలమయ్యాయి. ఈ మండలాల్లో అనేక లోతట్టు గ్రామాలు నీటి ముంపునకు గురికావడంతో ఇప్పటివరకు కూడా అధికార యంత్రాంగం ఈ ప్రాంతాల్లో సాధారణ పరిస్థితి నెలకొల్పేందుకు సహాయక చర్యలు చేపడు తూనే ఉంది. ఈ తరుణంలో మరొక ప్రకృతి విపత్తు సంభవించ బోతుందన్న వార్తలు ప్రజలను తీవ్ర భయాందోళనకు గురిచేస్తున్నది. వాతా వరణ కేంద్రం ముందస్తు హెచ్చరికల నేపథ్యంలో ప్రకృతి విపత్తులు ఎదుర్కొ నేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉంది. ఇందులో భాగంగా రక్షణ చర్యలు చేపట్టేందుకు ముందస్తు ఏర్పాట్లలో నిమగ్నమైంది. ఇప్పటికే లోతట్టు ప్రాంత ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. నాగిరెడ్డిగూడెం డ్యాం నీటిమట్టం కూడా క్రమేపి పెరుగుతోంది. బుడమేరు వాగు ఉధృతికి కొల్లేరు ప్రాంతమైన మండవల్లి మండలంలోని ములుగునూరు, పెదఎడ్లగాడి, ఏలూరు రూరల్ మండలంలోని కోమటిలంక, పెనుమాక లంక, ఇంగిలిపాక, నందిగాయలంక, శ్రీరామ్ నగర్ గ్రామాలు వరద ముంపునకు గురై కొల్లేరు సరస్సు నిండుగా ప్రవహిస్తూ రోడ్లపైకి నీరు చేరుకుని జనజీవనం స్తంభించి ▶మిగతా 2లో..

ధరలు నియంత్రించండి

6న ఏలూరు కలెక్టరేట్ ఎదుట ధర్నా

సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు నిత్యావసర వస్తువుల ధరలను అదుపు చేయాలని సిపిఐ జాతీయ సమితి ఇచ్చిన పిలుపులో భాగంగా ఈనెల 6న కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ఆందోళన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య పిలుపునిచ్చారు. సీపీఐ పిలుపు మేరకు బుధవారం జంగారెడ్డిగూడెం మండలం తాడువాయి సచివాలయం ఎదుట నిత్యావసరాల వస్తువుల ధరలు తగ్గించాలని, పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ ▶మిగతా 2లో..

ప్రభుత్వాసుపత్రిలో ఆర్వో ప్లాంట్

విశాలాంధ్ర-కాకినాడ : స్థానిక పభుత్వాసుపత్రిలో కోస్టల్ ఆక్వా ప్రైవేట్ లిమిటెడ్ వారి సౌజన్యంతో గంటకు మూడు వేల లీటర్ల సామర్థ్యం కలిగిన నాలుగు ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేయగా వాటిని బుధవారం జిల్లా కలెక్టర్ షణ్మోహన్ రిబ్బన్ కట్ చేసి లాంచనంగా ప్రారంభిం

చారు. చెవి, ముక్కు, గొంతు ఓపిలలో నూతనంగా ఏర్పాటు చేసిన రెండు ఆడియో మీటర్లను కలెక్టర్ షణ్మోహన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చేవారు మంచినీటికి ఇబ్బందులు పడేవారని, ఇప్పుడు ఆ ఇబ్బందులను పూర్తిగా అధిగమించినట్టు తెలిపారు. వినికిడి లోపం ఉన్నవారికి సదరం సర్టిఫికెట్లు జారీ చేసేందుకు, ఆపరేషన్ ముందు ఆపరేషన్ తర్వాత వినికిడి సామర్థ్యాన్ని పరీక్షించేందుకు వీలుగా ఈ ఆడియో మీటర్లు ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు. అనంతరం ఆసుపత్రిలో ఓపి అవుట్ పేషెంట్ విభాగం ▶మిగతా 2లో..

రైల్వే లైన్ నిర్మాణ పనులు వేగవంతం

విశాలాంధ్ర-కాకినాడ : అమలాపురం, కోటిపల్లి, నరసాపురం రైల్వే లైన్ ప్రస్తుత అలైన్మెంట్‌లో గ్రామాల వారీగా సర్వే చేసి ప్రజలు, ప్రభుత్వ శాఖల నుంచి ఉన్న అభ్యంతరాలను తెలపాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. బుధవారం అమలాపురం మండలం బట్నవిల్లిలో జాయింట్ కలెక్టర్ టి. నిషాంతి పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోటిపల్లి-నరసాపురం ప్రతిపాదిత రైల్వే లైన్ అలైన్మెంట్ అమలాపురం రూరల్ మండలాలలో బట్నవిల్లి, కామనగరువు, రోళ్ళ పాలెం, పేరూరు ఇమిడివరప్పాడు గ్రామాల గుండా వెళ్తుందని.. ఆయా గ్రామాలలో రైల్వే లైన్ అలైన్మెంట్‌కి అడ్డుగా రోడ్లు, కాలువలు, విద్యుత్ లైన్లు స్తంభాలు,

ఓఎన్జిసి గెయిల్ పైపులైన్లు, ఆర్‌డబ్ల్యూఎస్ ట్యాంకులు, నివాస గృహాలు తదితరాలు ఉన్నాయా లేదా అని సర్వే చేసి ప్రజలు, ప్రభుత్వ శాఖల నుంచి అభ్యంతరాలను సూచించిన ప్రొఫార్మాలో సెప్టెంబర్ 17 లోపు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అమలాపురం తహసిల్దార్ జిడి కిషోర్ బాబు, రెవిన్యూ సర్వే అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

దాతలకు కలెక్టర్ కృతజ్ఞతలు

విశాలాంధ్ర - తూర్పుగోదావరి : విజయవాడలోని వరద బాధితుల సహాయార్థం ఉదారత చాటుతూ, స్వచ్ఛందంగా స్పందించి ముందుకు వచ్చిన వ్యక్తులకు, కాంట్రాక్టర్లకు, పారిశ్రామిక వేత్తలకు, విద్యా సంస్థలకు, స్వచ్ఛంద సంస్థలకు ప్రతి ఒక్కరికి జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి

బుధవారం ఒక ప్రకటనలో పేరు పేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. సామాజిక బాధ్యతగా స్పందించిన పారిశ్రామివేత్తలు, కంపెనీ ప్రతినిధులకు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు వ్యక్తం చేస్తున్నామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన పిలుపుకు స్పందించి జిల్లా యంత్రాంగం విజ్ఞప్తిని గౌరవిస్తూ ఉదారతతో ఆపదలో ఉన్న ప్రజలను ఆదుకునేందుకు ముందుకు వచ్చిన ప్రతి ఒక్కరు వారి వంతుగా మానవత్వం చాటుకున్నారన్నారు.

విపత్తులను ఎదుర్కోవడానికి ప్రణాళికలు

కలెక్టర్ చదలవాడ నాగరాణి

విశాలాంధ్ర-భీమవరం: అధిక వర్షాలు, వరదలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ముందస్తు ప్రణాళికలతో ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు.బుధవారం స్థానిక కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి జిల్లా అధికారులతో సమావేశమై రానున్న రెండు రోజుల్లో పొంచి ఉన్న అల్పపీడనం కారణంగా ముందస్తు చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ ఇరిగేషన్ అధికారులు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలన్నారు.

గట్లు బలహీనంగా ఉన్న ప్రదేశాలను గుర్తించి పటిష్ట పరచడానికి వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. తూడు, కిక్కిస తొలగింపు పనులను వేగవంతం చేయాలన్నారు. ఏఈ లు క్షేత్రస్థాయిలో ఉండి పర్యవేక్షణ చేయాలన్నారు. మండల స్థాయి అధికారులు అప్రమత్తతోపాటు మిల్క్, తదితర సామాగ్రిని యుద్ధ ప్రాతిపదికన సిద్ధం చేసుకోవాల్సి ఉంటుందన్నారు. పంచాయతీల్లో, పట్టణాల్లో పారిశుధ్య లోపం ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. త్రాగునీటి పైప్ లైన్స్ లో డ్రైయిన్ నీరు కలవకుండా జాగ్రత్త తీసుకోవాలని, లీకేజీలను గుర్తించి వెంటనే కట్టడి చేయాలన్నారు. క్లోరినేషన్ చేయకుండా ఎట్టి పరిస్థితుల్లో తాగునీటిని సరఫరా చేయకూడదని ఆదేశించారు. పంచాయతీల్లో పారిశుధ్య కార్యక్రమాలను డిపిఓ, డిఎల్‌డిఓలు పర్యవేక్షించాలని ఆదేశించారు. మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు రైన్ కోట్స్, బ్లౌజులు, షూస్ ఇవ్వాలని సూచించారు. ప్రకృతి వైపరీత్యాల సందర్భంలో విద్యుత్ అంతరాయం ఏర్పడే అవకాశం ఉందని, అవకాశం ▶మిగతా 2లో..

ఉత్తమ సేవలకు పురస్కారం

నేడు ఉపాధ్యాయ దినోత్సవం

విశాలాంధ్ర-ఏలూరు: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లాలోని వివిధ యాజమాన్యాల పరిధిలో పనిచేస్తున్న 20 మంది టీచర్లను ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసినట్టు జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్. అబ్రహం తెలిపారు. విద్యా శాఖలో హై అచీవ్మెంట్ సాధించిన 11 పాఠశాలలను కూడా ఎంపిక చేసినట్టు ఆయన తెలిపారు. స్థానిక జడ్.పి. సమావేశ మందిరంలో గురువారం ఉదయం తొమ్మిదిన్నర గంటలకు ఎంపికైన ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం, జిల్లా స్థాయి పురస్కారాలు అందించనున్నట్టు ఆయన తెలిపారు.

ముంపుబారిన వరిపైర్లు... ఆందోళనలో రైతులు

విశాలాంధ్ర - ముదినేపల్లి : అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా వరిపైర్లు ముంపుబారిన పడ్డాయి. ఇంకా రెండు రోజులు ఇదేవిధంగా వర్షం పడితే నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముదినేపల్లి మండలంలో ఈ ఖరీఫ్ సీజన్లో 30 వేల ఎకరాలు వరిసాగు చేశారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా వడాలి, పెదకామనపూడి, చినకామనపూడి, చిగురుకోట, కోమర్రు గ్రామాలలో వరి నీటితో ముంపునకు గురైంది. వణుదుర్రు, ఊటుకూరు, దేవపూడి గ్రామాల్లో సుమారు 2వేల ఎకరాలు జలదిగ్బంధంలో ఉందని మండల వ్యవసాయశాఖాధికారి వేణుమాధవ్ తెలిపారు. రెండు రోజులు వర్ష ప్రభావం తగ్గితే నీరు బయటికి పోయి నష్టం ఉండదని రైతులు ఆందోళన చెందవద్దని వివరించారు.

వ్యాధులు ప్రబలకుండా హోమియో మందులు

విశాలాంధ్ర - ముదినేపల్లి : కాలానుగుణంగా సంభవించే వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు హోమియో మందులు అందుబాటులో ఉన్నట్లు ఆయుష్ వైద్యురాలు హేమలత తెలిపారు. ముదినేపల్లి పీహెచ్సీలో హోమియో (ఆయుష్) విభాగంలో చికెన్ గున్యా, మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ తదితర వ్యాధులు సోకకుండా ఉండేందుకు ముందస్తు నివారణకుగా హోమియో మందులు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయని మండలం ప్రజలు సమీపంలోని పీహెచ్సీల్లో మందులు పొందవచ్చని తెలిపారు. వ్యాధి సోకిన తర్వాత బాధపడే కంటే ముందస్తుగానే మందులు తీసుకోవాలని కోరారు.

గాడ్సన్ మినిస్ట్రీస్ ఆహార సరఫరా

విశాలాంధ్ర - ఆగిరిపల్లి : విజయవాడలోని కండ్రిక, పాయకాపురం ప్రాంతాలలోని 1000 మంది వరద బాధితులకు, రవాణా సౌకర్యం లేక ఎక్కడికక్కడ నిలిచి పోయిన లారీ డ్రైవర్లకు పులిహోర పొట్లాలు, వెజిటబుల్ బిర్యానీ పొట్లాలు, 1000 వాటర్ బాటిల్స్, 5 బస్తాల వాటర్ పాకెట్స్ గాడ్సన్ మినిస్ట్రీస్ వారు అందచేశారు. ఆహార పొట్లాలతో బయలుదేరిన వాహనాన్ని మాజీ ఎంపీటీసీ సభ్యులు కాజా రాంబాబు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా గాడ్సన్ మినిస్ట్రీస్ డైరెక్టర్ కోలేటి పాల్ రమేష్ మాట్లాడుతూ ఇటువంటి అత్యవసర పరిస్థితులలో అనేక మంది స్పందించి బాధితులకు సహాయపడటం ప్రభుత్వ విపత్తు ఉపశమన, పునరావాస కార్యక్రమాలకు తోడ్పడటం అభినందనీయమన్నారు. పలువురు స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకోండి : ఏపీ ఎన్జీవో

విశాలాంధ్ర- ఏలూరు : గత ఐదు రోజులుగా విజయవాడలో వరద ముంపుకు గురైన బాధితులను ఆదుకోవాలని ఏపీ ఎన్జీవో పిలుపునిచ్చింది. ఈ మేరకు బుధవారం బాధితుల సహాయార్థం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఏపీ ఎన్జీవో అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవాడ వరద బాధితుల కోసం బిస్కెట్లు, ఆహార ప్యాకెట్లు, వాటర్ బాటిల్స్, రొట్టె ప్యాకెట్లు సిద్ధం చేసి పంపించారు.
ఈ సందర్భంగా ఏపీఎన్జీవో నాయకులు చోడగిరి శ్రీనివాస్ మాట్లాడుతూ గత ఆరు రోజులుగా విజయవాడ నగరం వరద ముంపునకు గురై ప్రజలు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయి అల్లాడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల వరద బాధితుల కోసం తమ అసోసియేషన్ తరపున ఆహారం అందజేస్తున్నామని అదేవిధంగా దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి వరద బాధితులను ఆదుకోవాలని శ్రీనివాస్ పిలుపునిచ్చారు.

వరద ప్రభావం తగ్గేవరకు అప్రమత్తంగా ఉండాలి

-ముంపు గ్రామ ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలి

-కలెక్టర్ కె. వెట్రిసెల్వి

విశాలాంధ్ర-ఏలూరు భద్రాచలం వద్ద పెరుగుతున్న గోదావరి నది వరద ఉధృతి నేపథ్యంలో వరద ప్రభావం తగ్గేవరకు అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి తెలిపారు. వరద ఉధృతి రెండవ ప్రమాద హెచ్చరికకు చేరే అవకాశం ఉన్నందున జిల్లా యంత్రాంగం, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎటువంటి ప్రాణ నష్టానికి తావులేకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయడంతోపాటు వరద ప్రభావం వలన కటాఫ్ అయ్యే నివాసిత ప్రాంతాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలన్నారు. పునరావాస కేంద్రాలను, వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడమే కాకుండా అన్ని సౌకర్యాలు ఉండేలా అధికారులు పర్యవేక్షణ చేయాల న్నారు. పునరావాస కేంద్రాల్లో నిత్యావసర సరుకులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ముంపు ప్రభావిత ప్రాంతా ల్లోని నిండు గర్భిణీ, వృద్ధులను సురక్షిత ప్రాంతాలకు తరలించే కార్యక్రమాలను ముమ్మరం చేయాలన్నారు. త్రాగునీటికి ఇబ్బంది లేకుండా వాటర్ ప్యాకెట్లు వంటి సౌకర్యాలను అందుబాటులో ఉంచాలన్నారు. వరద నీటిమట్టం పెరుగుతున్న స్థాయిని అనుసరించి ఇరిగేషన్ అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుని మిగిలిన ప్రాంతాల్లో కూడా వరద కారణంగా ముంపుకు గురయ్యే గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి సహాయ కార్యక్రమాలను పర్యవేక్షించాలన్నారు. వరద సహాయక కార్యక్రమాల్లో ఎక్కడా ఏవిధమైన ఫిర్యాదులకు తావులేకుండా అధికారులు బాధ్యతతో పనిచేయాలన్నారు.

ఆర్వో ప్లాంట్

(1వ పేజీ తరువాయి)

తనిఖీ చేశారు. ఔట్ పేషెంట్ విభాగం మరమ్మతులకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఏపీఎంఎస్ఐడిసి ఇంజనీరింగ్ అధికారులు జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సూచించారు.
ఈ కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్య కుమారి, ఆర్ఎంఓ డాక్టర్ అనిత, కోస్టల్ ఆక్వా ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికలు

(1వ పేజీ తరువాయి)

ఉన్నవారు సోలార్ విద్యుత్తును అమర్చుకుంటే ఇబ్బంది ఉండదని ఈ సందర్భంగా సూచించారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఓ జె.ఉదయభాస్కరరావు, తాడేపల్లి గూడెం ఇన్చార్జి ఆర్డీవో, కె ఆర్ ఆర్ సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణ రెడ్డి, నరసాపురం ఆర్డీవో, భీమవరం ఇన్చార్జి ర్డీవో ఎం.అచ్యుత్ ఆనంద్, సిపిఓ ఎం.మోహనరావు, డిపిఓ విక్టర్, డి ఎం హెచ్ ఓ డాక్టర్ డి.మహేశ్వర రావు, అధికారులు పాల్గొన్నారు.

ముంచుకొస్తున్న ముప్పు

(1వ పేజీ తరువాయి)

గత రెండు రోజులుగా బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయిన పరిస్థితులు ఏర్పడ్డాయి.
ఎగువన వర్షాలు భారీగా కురుస్తున్న నేపథ్యంలో కొల్లేరు సరస్సుకు మరింత వరద నీరు పెరిగే అవకాశం ఉండడంతో ఈ ప్రాంతాన్ని బుధవారం జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి, ఎస్పీ శివ కిషోర్, ఏలూరు ఆర్డీవో ఖాజావలి, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తదితరులు పరిశీలించి తీసుకోవాల్సిన రక్షణ చర్యలపై కిందిస్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మరోవైపు గోదావరి ఉగ్రరూపం దాల్చుతూ అంతకంతకు పెరిగి బుధవారం సాయంత్రానికి భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 43 అడుగులకు చేరుకోవడంతో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు.
దీంతో అప్రమత్తమైన జిల్లా అధికారులు గోదావరి పరివాహక ప్రాంతాలైన కుకునూరు, వేలేరుపాడు, పోలవరం మండలాల్లోని లోతట్టు ప్రాంత ప్రజలను ముందస్తు రక్షణ చర్యల్లో భాగంగా సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఈ నెల 5, 6 తేదీల్లో బంగాళాఖాతంలో ఏర్పడబోయే అల్పపీడన ప్రభావం ఏ స్థాయిలో ఉంటుంద నేది తెలుస్తుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. తుఫాను హెచ్చరికలతో జిల్లా యంత్రాంగాన్ని మరింత పరుగులు పెట్టించి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నది.

ధరలు నియంత్రించండి

(1వ పేజీ తరువాయి)

రోజు,రోజుకు నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి సామాన్య ప్రజలు బతకడానికి తీవ్ర కష్టాలు పడాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. కూరగాయలు, గ్యాస్, డీజిల్ ,పెట్రోల్, ధరలు పెరుగుతున్నా పాలకులు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. సామాన్య ప్రజలు, పేద ప్రజలు ఆదాయం పెరగకుండా ధరలు విపరీతంగా పెరగడంతో ప్రజా జీవనం అస్తవ్యస్తంగా మారుతోందన్నారు. నరేంద్ర మోడీ ఇచ్చిన హామీలు 10 ఏళ్లు దాటినప్పటికీ అమలుకు నోచుకోలేదన్నారు. ఆహార భద్రతా చట్టం పకడ్బందీ అమలు, ధరల స్థిరీకరణ నిధి, రైతుల పంటలకు గిట్టుబాటు ధర వంటి హామీలు ఏ ఒక్కటీ నెరవేర్చలేదని విమర్శించారు. ధరలు నియంత్రించాలని ఈనెల 6న కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జంగారెడ్డిగూడెం మండల సహాయ కార్యదర్శి కుంచె వసంతరావు,మండల కమిటీ సభ్యులు గొలిమే బాలయేసు,తాడువాయి గ్రామ శాఖ కార్యదర్శి చందా త్రిమూర్తులు, గొల్లగూడెం శాఖ కార్యదర్శి పేరుభోయిన నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు ఎర్రగొర్ల సూర్యచంద్రం, రామారావు , తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శిగా అలివేలు మంగ

విశాలాంధ్ర-లింగపాలెం: ఏలూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శిగా ధర్మాజీగూడెం ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయురాలుగా పని చేస్తున్న అలివేలు మంగ నియమితు లయ్యారు. జిల్లాలో స్కూల్స్ పరిధిలో జరిగే క్రీడా పోటీలు ఈమె పరిధిలోనే జరుగుతాయి. రెండేళ్లపాటు ఈమె ఈ పదవిలో కొనసాగు తారు.తమ పాఠశాలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయురాలను ఈ పదవికి ఎంపిక చేయటం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. క్రీడల అభివృద్ధికి అలివేలుమంగ చేస్తున్న కృషిని ఈసందర్భంగా ప్రశంసించారు. పదవిని చేపట్టిన ఈమెకు అభినందనలు తెలిపారు.

రక్తదాన శిబిరం

విశాలాంధ్ర-లింగపాలెం: వాసవి క్లబ్ వ్యవస్థాపకులు కే.సి. గుప్తా జయంతిని పురస్కరించుకొని ధర్మాజీగూడెంలో వాసవి క్లబ్, వనిత డైమండ్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 20మంది రక్తదానం చేశారు. జంగారెడ్డిగూడెం సన్ రైజ్ బ్లడ్ బ్యాంక్ వారు రక్తాన్ని సేకరించారు.కార్యక్రమంలో బొనగిరి, ప్రకాష్ రావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ నిర్వాహకులు సోమిశెట్టి గంగాధర్ రావు, బలరాం కృష్ణ, పుల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సర్దుబాటు

విశాలాంధ్ర-లింగపాలెం: ఉపాధ్యాయులపని సర్దుబాటు ప్రక్రియలో భాగంగా లింగపాలెం మండ లంలో ఏడుగురు ఎస్.జి.టి ఉపాధ్యా యులను మఠం గూడెం, అయ్యప రాజు గూడెం యూపీ పాఠశాల లకు ముగ్గురు చొప్పున యడవల్లి ఎంపీపీ పాఠశాలకు ఒకరిని సర్దుబాటు చేసినట్లు మండల విద్యాశాఖ అధికారి రవీంద్ర తెలిపారు. మండలంలో 13 మంది ఉపాధ్యాయులు ఎక్కువగా ఉన్నట్లు గుర్తించామని వీరిలో ఏడుగురిని సర్దుబాటు చేసామని తెలిపారు. మిగిలిన ఆరుగురు ఉపాధ్యాయులను నూజివీడు డివిజన్ పరిధిలో నియమిస్తామని డివిజన్ పరిధిలో ఖాళీలు లేకపోతే మండలంలో ఉంచి సర్దుబాటు చేస్తామని ఈయన తెలిపారు.

బాధితులకు సాయం

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : గత నాలుగు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా, మండలంలో అంకాలుగూడెం ఎస్సీ కాలనీకి చెందిన , బుద్ధుల తిరుపతయ్య ఇల్లు పడిపోవడంతో విషయం తెలుసుకున్న రెవెన్యూ ఇన్స్పెక్టర్ మణిదివ్య, బోడిగూడెం గ్రామ సచివాలయ కార్యదర్శి ప్రసాద్, సర్పంచ్ గడ్డియ్య, బాధిత కుటుంబానికి బియ్యం పంపిణీ చేశారు. మణి దివ్య మాట్లాడుతూ వర్షా ప్రభావం ఎక్కువ ఉన్నందున , లోతట్టు ప్రాంతాలలో జీవనం కొనసాగించే కుటుంబాల వారు, తమ ఇండ్లను ఖాళీ చేసి ప్రభుత్వం వారు చూపించే మెరుగైన పునరావాస కేంద్రానికి వెళ్లాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు హెచ్చరిక

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : ఎడతెరిపి లేకుండా వర్షాలు కురవడంతో కొండ

ప్రాంతాల నుండి వస్తున్న నీటి ప్రవాహనికి కాలు వలు పొంగిపొర్లుతున్నా యని, ఏజెన్సీ ప్రాంతా లలో కొండ ప్రాంతాల నుండి అధికంగా నీరు వస్తున్నందున, ప్రయాణికులు కాలువలు దాటడానికి ప్రయత్నించవద్దని, ప్రమాదానికి గురికా వద్దని ఎస్సై వి.చంద్రశేఖర్ ప్రయాణికులకు హెచ్చరిక జారీ చేశారు. మండలంలో కన్నాపురం గ్రామంలో తూర్పు, పడమటి కాలువలు పొంగిపొర్లు తున్నందున కాలువలు దాటేవారు తమ ప్రయాణాలు నిలిపివేయాలని, ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నందున జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్సై చంద్రశేఖర్ పడమటి కాలువ వద్ద ప్రయాణికుల రాకపోకలను, నిలిపివేశారు. ఈయన వెంట రెవెన్యూ సిబ్బంది, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

స్టేట్ మీట్‌లో సత్తా చాటిన ఏఆర్‌డిజికె స్కూల్ విద్యార్థులు

విశాలాంధ్ర-ఏలూరు: స్థానిక లక్ష్మి వారి పేటలో ఆంధ్ర రత్న దుగ్గిరాల గోపాల కృష్ణయ్య మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు ఇటీవల అనకాపల్లిలో జరిగిన వెయిట్ లిఫ్టింగ్ రాష్ట్రస్థాయి పోటీలలో 40 కేజీల విభాగంలో ఎం.పావని ప్రథమ స్థానం సాధించి,గోల్డ్ మెడల్ సాధించింది. ఎం.ధోని(శ్రీ)ద్వితీయ స్థానం సాధించారు.45 కేజీల విభాగంలో జి.పవిత్ర,49 కేజీల విభాగంలో కె. భార్గవి, 55 కేజీల విభాగంలో సిహెచ్.కీర్తన 59 కేజీల విభాగంలో సిహెచ్.హారిక రెడ్డి ద్వితీయ స్థానం సాధించారని ప్రధాన ఉపాధ్యాయు రాలు షారోన్ ఉజ్వల,పాఠశాల ఇన్‌చార్జి హెచ్ ఎం.,వి కాంతి జయ కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు పైడా పుల్లారావు వివరించారు. చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తున్న క్రీడాకారులను పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు, సోషల్ వర్కర్ గొంతిన రామకృష్ణ అభినందించారు. ఈ కార్యక్రమంలో పసుపులేటి సోమరాజు,నేరుసు శివ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

చేబ్రోలు ఎస్సైగా సూర్య భగవాన్

విశాలాంధ్ర- ఉంగుటూరు:

ఉంగుటూరు మండలం చేబ్రోలు పోలీస్ స్టేషన్ ఎస్ఐగా ఎం.సూర్య భగవాన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన కృష్ణాజిల్లా జగ్గయ్యపేట పోలీస్ స్టేషన్ నుండి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ ఎస్సై ఎ. మణికుమార్ గణపవరం పోలీస్ స్టేషన్ కు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేకాట, కోడిపందాలు ఆడితే సహించేది లేదని హెచ్చరించారు.

పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రఘురామకృష్ణ రాజు

విశాలాంధ్ర- పాలకోడేరు : మండల కేంద్రమైన పాలకోడేరు లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అదనపు గదిని, రోగులకు ఉపయోగపడే విధంగా ఏర్పాటు చేసిన

మరుగుదొడ్లను, ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని పశువుల ఆసుపత్రి భవనాన్ని ఉండి శాసన సభ్యులు కనుమూరి రఘురామ కృష్ణంరాజు బుధవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజు మాట్లాడుతూ ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడంలో తాను ముందు ఉంటానని అన్నారు. పాలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సిహెచ్ వి రంగం నాయుడు మాట్లాడుతూ ఎప్పటినుంచో ఆసుపత్రి పైభాగాన నిర్మించిన అదనపు గది అసంపూర్తిగా నిలిచిపోయిందని ఇదే విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లిన వెంటనే ఆయన స్పందించి నెల రోజుల్లో పూర్తిచేయించా రన్నారు. ఎమ్మెల్యే వెంట సొసైటీ బ్యాంకు మాజీ చైర్మన్ కొత్తపల్లి నాగరాజు, సర్పంచ్ ఇంజేటి మరియమ్మ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ముంపు గ్రామాలు అప్రమత్తం

- పునరావాస కేంద్రాలకు తరలించండి
- ఏలూరు జేసీ ధాత్రి రెడ్డి

విశాలాంధ్ర-కుక్కునూరు: గోదావరి ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉందని కుక్కు నూరు మండలంలో ముంపు గ్రామాలను అప్రమత్తం చేసి బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఏలూరు జిల్లా జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని గొమ్ముగూడెం గ్రామంలో పర్యటించి గ్రామస్తులతో మాట్లా డారు. భద్రాచలం వద్ద గోదావరి మొదటి ప్రమాద హెచ్చరిక దాటి ప్రవహిస్తుందని, దీంతో గొమ్ముగూడెం చుట్టూ వరద చుట్టు ముట్టే అవకాశం ఉందని ప్రజలను హెచ్చరించారు. సుమారు 220 కుటుంబా లను ఇక్కడి నుంచి దాచవరం ఆర్అండ్ఆర్ కాలనీకి(పురావస కేంద్రం) తరలించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం దాచ వరం పునరావాస కాలనీని జేసీ సందర్శిం చారు.వసతి ఏర్పాట్లు పై అధికారులను వివరాలు అడిగి తెలుసు కున్నారు. ఈ కార్య క్ర మంలో పోలవరం డీఎస్పీ వెంకటేశ్వరరావు, సిఐ రమేష్, ఎమ్మార్వో పెద్దిరాజు, ఎంపీడీఓ శ్రీనివాస రావు, కుక్కు నూరు ఎస్సై రామకృష్ణ, టిడిపి మండల అధ్యక్షుడు ములిశెట్టి నాగేశ్వరావు, నాయకులు కోటగిరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విపత్కర పరిస్థితుల్లో అండగా నిలుస్తున్న వారికి ధన్యవాదాలు

విశాలాంధ్ర-భీమవరం: విపత్కర పరిస్థితుల్లో పెద్ద మనసు చాటుకున్న వారు ధన్యులని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు.బుధవారం స్థానిక కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరంలో జిల్లా ముఖ్య ప్రణాళిక కార్యాలయం అధికారులు, సిబ్బంది జిల్లా కలెక్టర్‌ను కలిసి వరద బాధితుల సహాయార్థం రూ.1.21 లక్షలు చెక్కును సిపిఓ ఎం.మోహన్‌రావు చేతుల మీదుగా అందజ శారు. ఉండి మండలం కలిగొట్ల గ్రామం నివాసి హైదరాబాదు ఐఐసీటీలో పనిచేస్తూ రిటైర్డ్ అయిన విశ్రాంత ఉద్యోగి సాగిరాజు వెంకట సత్యనారాయణ రాజు వారు దాచుకున్న సేవింగ్స్ నుండి రూ.50 వేల చెక్కును జిల్లా కలెక్టర్ చాంబరులో అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ విజయవాడ ఎదుర్కొంటున్న అకాల వరదలకు ప్రతి ఒక్కరూ తమకు తోచిన రీతిలో సహాయం చేయడం ఎంతో

సంతోషించదగిన విషయం అన్నారు. ఈ సందర్భంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఓ జె. ఉదయ భాస్కరరావు, సిపిఓ ఎం.మోహన్ రావు,సిపిఓ కార్యాలయ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

జ్వరాలతో బురద నీరు తాగాలా?

విశాలాంధ్ర-చాట్రాయి : జ్వరాలు... తీవ్రమైన ఒళ్ళు నొప్పులతో బురద నీరు తాగాలా....? బురద నీరు స్నానం చేయాలా....? ఈరోజు కూడా బురద నీరే వచ్చాయంటూ చనుబండ ఎంపీటీసీ సోని ఆనంద్ ప్రశ్నించారు. బుధవారం చాట్రాయి ఎంపిపి లంకా నిర్మల అధ్యక్షతన జరిన మండల పరిషత్ అత్యవసర సర్వసభ్య సమావేశంలో వైద్య ఆరోగ్యశాఖ అధికారి మాట్లాడుతుండగా చనుబండ ఎంపీటీసీ సోనీ ఆనంద్ మాట్లాడుతూ. మీరు ఎన్ని చెప్పినా జనాలు జ్వరాలతో తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు.కనీసం సరిగా బ్లీచింగ్ కూడా చల్లడం లేదు ఏదో సున్నం కొంచెం పోసి వెళ్ళిపోతున్నారు. ఇక మంచినీళ్ల చెప్పే పనే లేదు. జూన్ నెల నుంచి వాటర్ ట్యాపుల్లో బురదనీరే వస్తుంది . అసలే తీవ్రమైన జ్వరాలు ఒళ్ళు నొప్పులు బురద నీరు తాగాలా బురద నీటితో స్నానం చేయాలా...? జ్వరాలు ఎలా తగ్గుతాయి అని ప్రశ్నించారు. మండల పరిషత్ ఉపాధ్యక్షులు పుచ్చకాయల సుబ్బారెడ్డి మాట్లాడుతూ. జలజీవన్ పనులు చేసిన ప్రతిచోట త్రాగునీటి సమస్య బురద నీళ్లు తీవ్రంగా ఉన్నాయి అన్నారు. జనార్ధన వరం ఎంపిటిసి కృష్ణ మాట్లాడుతూ. గ్రామంలో తాగునీటి పైపులైన్లు తీవ్రంగా కలుషితమైతున్నా యన్నారు. కృష్ణారావు పాలెం ఎంపీటీసీ చింతగుంట్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తాగడానికి గుక్కెడు నీళ్లు కూడా ఇవ్వరా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంఈఓ వివిఎస్ వి బ్రహ్మాచారి మాట్లాడుతూ మండలంలో కొన్ని పాఠశాలల ఆవరణలో నీరు నిలుస్తుందని దానివలన విద్యార్థులకు ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్నాయని కొన్నిచోట్ల పాఠశాల భవనాలు బాగోలేదని వర్షాలు కురుస్తున్న సందర్భంలో అటువంటి చోట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజా ప్రతి నిధులు కూడా వెళ్లి పాఠశాలలను పరిశీలించి భవనాలు బాగోపోతే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో దుర్గాప్రసాద్ ఏ ఈ సంజయ్ చిత్తపూరు సర్పంచ్ తిరువీధి రమేష్ సోమవారం సర్పంచ్ ఉప్పల శోభన్ బాబు చనుబం సర్పంచ్ విస్సంపల్లి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

మామిడి తోటలో నీటి నిల్వలను తొలగించండి

మామిడి పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త బొర్రా కనకమహాలక్ష్మి

విశాలాంధ్ర-నూజివీడు : అకాల వర్షాలతో మామిడితోటల్లో బాగా నీరునిల్వ ఉండే అవకాశం ఉందని రైతులు ఆ నీటిని తొలగించే ఏర్పాట్లు చేసు కోవాలని

వైఎస్సార్ హార్టికల్చర్ విశ్వవిద్యాలయం అనుబంధ నూజివీడు మామిడి పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త బొర్రా కనక మహాలక్ష్మి కోరారు. బుధవారం జిల్లా ఉద్యానశాఖ అధికారి రామ్మోహన్‌తో కలిసి నూజివీడు మండలం మీర్జాపురంలో మిర్చిపంటను పరిశీలించారు. రాష్ట్రంలో మామిడి ముఖ్యంగా ఉమ్మడి కృష్ణా, ఉభయ గోదావరి, కోస్తా, రాయలసీమ జిల్లాల్లో అధిక విస్తీర్ణంలో సాగవుతోందని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల అధిక వర్షాలు పెద్దఎత్తున కురిసినందున మామిడితోటల్లో కొమ్మలు విరగటం, ఇంకొన్ని చోట్ల చెట్లు ఒరగటం వంటివి జరిగే అవకాశం ఉందన్నారు. అందువల్ల మామిడితోటల్లో వీలైనంత త్వరగా అధికంగా ఉన్న నీటిని పంపించే ఏర్పాట్లు చేసుకోవా లన్నారు. కొత్తగా నాటిన మొక్కలకు, 2-3 అడుగుల ఎత్తు ఉండే కర్రలను ఊతం ఇవ్వాలని పేర్కొన్నారు. ఒరిగిన లేదా పడిపోయిన చిన్న చెట్లను లేపి మట్టిని ఎగదోయాలన్నారు. విరిగిన కొమ్మలను కత్తిరించి పైభాగాన బోర్డో పేస్ట్ లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్‌ను పూతగా పూయాలని సూచించారు.

వరద బాధితులకు ఆహారం పంపిణీ

విశాలాంధ్ర-భీమడోలు: విజయవాడ వరద బాధితులను ఆదుకోవడానికి

పూళ్ళ, ఎం.ఎం. పురం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఐదు వేల బిర్యానీ ప్యాకెట్లు, పదివేలు వాటర్ ప్యాకెట్ల పంపిణీ కార్యక్రమం బుధవారం జరిగింది.భీమడోలు మండలం పూళ్ల వర్తక సంఘం కళ్యాణ మండపంలో బుధవారం తెల్లవారుజాము నుండి పూళ్ళ,ఎం.ఎం.పురం ఆర్యవైశ్య సంఘం వారు సిద్ధం చేసిన బిర్యానీ ప్యాకెట్లు,వాటర్ ప్యాకెట్లను భీమడోలు మండల రెవెన్యూ సిబ్బంది పర్యవేక్షణలో విజయవాడకు ప్రత్యేక వాహనంలో తరలించారు. పూళ్ళ,ఎంఎం పురం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కనుమర్ల వెంకట సుబ్బయ్య, ఉపాధ్యక్షులు సత్యనారాయణమూర్తి, కాకొల్లు శ్రీనివాసరావు, బొండాద బుజ్జి, రాజా, కపలవాయి సాంబశివరావు, పెదమళ్ళు సతీష్ , సంఘ సభ్యులు పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకోవాలి

విశాలాంధ్ర -భీమవరం: ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం మానవత్వ మని, అందరూ చేయి చేయి కలిపితేనే వరద పరిస్థితుల

నుండి ప్రజలను రక్షించుకో గలుగు తామని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. విజయవాడ వరద బాధితుల సహాయార్థం టీడీపీ బిసి రాష్ట్ర సాధికారిత కమిటీ సభ్యులు గంటా త్రిమూర్తులు ఆధ్వర్యంలో రూ. 75 వేలను ఎమ్మెల్యేకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏదైనా అనుకోని విపత్తు సంభవించినప్పుడు మంచి ఆలోచన చేసి బాధితులకు సహాయం అందించవల సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గంటా త్రిమూర్తులు మాట్లాడుతూ వరద బాధితులకు సుమారు 200 కుటుంబా లకు నిత్యావసర సరుకులు అందించేలా గంటా నరసింహామూర్తితో రూ.75 వేలు పంపిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర నాయకులు మెంటే పార్థసారథి, మద్దల రాము, యలమంచిలి శ్రీను, మరపట్ల శ్యామ్ బాబు, విన్నకోట వినాయక్, కాపా అమర్ బాబు, సాయి రామ్, గంటా వెంకన్న, గొలగని దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : విద్యుదాఘాతానికి గురై వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల కేంద్రమైన కొయ్యలగూడెం పట్టణంలో బుధవారం చోటుచేసుకుంది. కూరగాయల మార్కెట్లో జట్టు కూలీగా పనిచేసే భీమడోలు శ్రీనివాస్(42) కొయ్యలగూడెం పట్టణంలోని స్థానిక సంత మార్కెట్లో విద్యుత్ షాక్ తగిలి బుధవారం మృతి చెందారు.మృతునితో పాటు పనిచేసే కూలీలు తెలిపిన వివరాల ప్రకారం, తామంతా ప్రతీవారం లాగానే వారపు సంతలో కూరగాయల లోడింగ్,అన్ లోడింగ్ పనులకు వచ్చామని,శ్రీనివాస్ మార్కెట్లో ఒక బొలెరో వాహనం నుంచి టమాటా లోడు దించుతుండగా,పైన ఉన్న విద్యుత్ వైర్లు తగలడంతో విద్యుద్ఘాతానికి గురై కింద సిమెంటు రోడ్డుపై పడిపోవడంతో తలకు బలమైన గాయం తగిలి రక్తస్రావం కావడంతో,స్థానిక ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా, అప్పటికే మృతి చెందాడని తెలిపారు. విషయం తెలుసుకున్న ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మంత్రి కొలుసు పార్థసారధి కుర్చీలు వితరణ

విశాలాంధ్ర- నూజివీడు : నూజివీడులోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్కు రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారధి 50 కుర్చీలను వితరణగా అందజేశారు. గత వారం పర్యటన భాగంగా నూజివీడు పట్టణంలో పర్యటించగా కోనేరు పేట అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ సిబ్బంది,ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు తమ సెంటర్కు వచ్చే పేషంట్లకు,సిబ్బందికి తగినన్ని కుర్చీలు లేక నానా ఇబ్బందులు పడుతున్నామని మంత్రి సారథి దృష్టికి తీసుకురాగా మంత్రి వెంటనే తన వ్యక్తిగత సిబ్బందిని కుర్చీలు ఏర్పాటు చేయమని ఆదేశించారు. బుధవారం ఉదయం మంత్రి క్యాంపు ఆఫీసుకునకు హెల్త్ సెంటర్ సిబ్బందిని పిలిపించి 50 కుర్చీలను కార్యాలయ సిబ్బంది అందజేశారు.

ఉత్తమ ఉపాధ్యాయునిగా రామోజీరావు

విశాలాంధ్ర-కైకలూరు: గోనెపాడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సెకండ్ గ్రేట్ ఉపాధ్యాయు డిగా పనిచేస్తున్న విశ్వనాథుని రామోజీరావు 2024 సంవత్సరానికి ఏలూరు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికయ్యారు. 2010 నవంబరు 6వ తేదీన చాట్రాయి మండలం యర్రా వారి గూడెం ప్రాథమిక పాఠశాల నుండి తన సర్వీసును ప్రారంభించి 2015 సాధారణ బదిలీలలో భాగంగా మండవల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల చింతపాడుకు బదిలీ అయ్యారు. అక్కడ నుండి 2023 సాధారణ బదిలీల్లో భాగంగా కైకలూరు మండలం గోనెపాడుకు బదిలీగా వచ్చి ప్రస్తుతం ఇక్కడే పని చేస్తున్నారు. పాఠశాల స్థాయిలో జరిగే అనేక జాతీయ భావం పెంపొందించే కార్యక్రమాలు నిర్వహణ,క్రీడా కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులను ఆదర్శ పౌరులుగా తీర్చిదిద్ద డానికి తన వంతు కృషి చేశారు.

ఉద్యమ నాయకుడు రెడ్డి నాయుడు

విశాలాంధ్ర-వీరవాసరం: రైతులు, రైతు కూలీల కోసం ఎన్నో ఉద్యమాలు నడిపి ఈనాటికి అవి గుర్తుండేలా చేసిన నాయకుడు వెంకట రెడ్డి నాయుడని సిపిఐ, ఏఐటి యుసి కార్యవర్గ సభ్యులు సిహెచ్. రంగారావు, జిల్లా బిజెపి కార్యదర్శి కూరెళ్ళ నరసింహరావులు సంయు క్తంగా తెలిపారు. మెంటేపూడి గ్రామ మాజీ సర్పంచ్ బోడపాటి వెంకట రెడ్డినాయుడు 13వ వర్థంతిని గ్రామంలో ఆయన విగ్రహం వద్ద బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఆయన చేసిన ఉద్యమాలు ఎంతో మందికి స్ఫూర్తని, ఆయన పార్టీకి ఎన్నో సేవలు చేశారని కొనియాడారు. గ్రామ సర్పంచ్ గా ఉన్నప్పుడు గ్రామ ప్రజలకు గుర్తు ఉండేలా ఎన్నో కార్యాక్రమాలు చేపట్టారని, గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దా రన్నారు.గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ పాఠశాల, మంచినీటి రోడ్డు సౌకర్యాలు ఆయన సర్పంచ్ గా చేసిన కాలంలోనే అభివృద్ధి చేశారన్నారు. అనంతరం గ్రామంలోని పాఠశాల విద్యార్థులకు ఆయన కుమారుడు బిపి.నాయుడు విద్యా సామాగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయుడు గారి అభిమానులు, పార్టీ సభ్యులు, గ్రామ పెద్దలు, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ధరల పెరుగుదలపై ఉద్యమం

విశాలాంధ్ర-కుక్కునూరు: నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించకపోతే సిపిఐ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని సిపిఐ కుక్కునూరు మండల కార్యదర్శి మైసాక్షి. వెంకటాచారి పేర్కొన్నారు. సిపిఐ దేశ వ్యాప్త ఆందోళనలో భాగంగా బుధవారం మండలంలో కుక్కునూరు, మారేడుబాక, దాచవరం, ఆర్వపల్లి పంచాయితీల్లోని సచివలయాల వద్ద ఆందోళనకు దిగారు. ధరల తగ్గింపు, ఏజెన్సీ ప్రాంత సమస్యలపై వినతి పత్రాన్ని సచివాలయ సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటు వర్షాలు, ఇటు గోదావరి వరద ఉధృతికి కుక్కునూరు మండల ఏజెన్సీ గ్రామాలకు తీవ్ర నష్టం కలిగిందన్నారు. బాధితులను అన్నీ విధాలా ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పునరావాస కేంద్రాల్లో పూర్తి స్థాయిలో వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు.గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్తగా పారిశుధ్య చర్యలు ముమ్మరం చేసి మెరుగైన వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ ఆందోళనలో జిల్లా కౌన్సిల్ సభ్యులు కురాకుల. బాబూరావు,గిరిజన సంఘం నాయకులు వర్సా. పాపారావు, సోడే రాంబాబు, పూరెం.లక్ష్మయ్య పాల్గొన్నారు.

కొయ్యలగూడెంలో: అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు అందజేయాలని, సిపిఐ మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు పేర్కొన్నారు. మండలంలో

బోడిగూడెం, ఎర్రంపేట గ్రామ సచివాలయాల వద్ద, సచివాలయాల సిబ్బందికి సిపిఐ నాయకులతో కలిసి వినతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా జమ్మి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయని, పెట్రోల్, డీజిల్, గ్యాస్, కిరాణా సరుకులు, కూరగాయల ధరలు, ఆకాశాన్ని అంటుతున్నాయని, పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు వెంటనే తగ్గించాలని, అర్హులైన వారందరికీ రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డులు అందజేయాలని, శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమాలలో దుగ్గిరాల నారాయణరావు, చింతల పూడి. దుర్గారావు, పెద్దకాపు, సత్యనారాయణ, ఎం లక్ష్మణరావు, జక్కు నాగేశ్వరరావు, జక్కూ మంగరావు, సూరిబాబు, మెంటే దొరయ్య, తేలే వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెంలో : పెంచిన నిత్యావసర వస్తువుల ధరలను తక్షణం తగ్గించాలని, పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గించాలని, నిరుపేదలకు రేషన్ కార్డుతో పాటు 14 రకాల నిత్యావసర వస్తువులను పంపిణీ చేయాలని బుధవారం జంగారెడ్డిగూడెం మండలం కేతవరం గ్రామ సచివాలయం ఎదుట సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి సిబ్బందికి మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు

మాట్లాడుతూ ఇటీవల కురిసిన తుపానుకు రైతాంగం తీవ్రంగా నష్టపోయారని ,రైతులందరికి ఇన్పుట్ సబ్సిడీ ఇచ్చి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు . ఈ కార్యక్రమంలో సిపిఐ జంగారెడ్డిగూడెం మండల సహాయ కార్యదర్శి కుంచె వసంతరావు మండల కమిటీ సభ్యులు గొలిమే బాలయేసు, కేతవరం గ్రామ సిపిఐ శాఖా కార్యదర్శి మంచాల ప్రభాకర్ రావు ,పొట్టియ్య అంకాలయ్య, రత్తయ్య, పోడపాటి ఘటోత్కచుడు, నెట్టా రామారావు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు ఎమ్మెల్యే చంటి ఆపన్నహస్తం

విశాలాంధ్ర-ఏలూరు: విజయవాడ వరద బాధితులకు ఆహారంతోపాటు వస్త్రాలు అందించిన ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య(చంటి) ను రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి ప్రత్యేకంగా అభినందించారు. విజయవాడలో వరద బాధితులకు ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి ఏర్పాటు చేసిన దుప్పట్లు, టవల్స్ ను బాధితులకు అందించే కార్యక్రమంలో రాష్ట్రమంత్రి కొలుసు పార్థసారధి పాల్గొన్నారు. వరద బాధితులకు ఆపన్నహస్తం అందిస్తున్న బడేటి

సేవలు నిరుపమానమన్నారు.వరద బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) మాట్లాడుతూ విజయవాడ నగరంలోని 10 డివిజన్లలో బాధితులను ఆదుకునే కార్యక్రమాలు చేపట్టామన్నారు.

ముంపు ప్రభావిత ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటన

విశాలాంధ్ర-వేలేరుపాడు: మండలంలోని కట్కూరు, కోయిదా పంచాయతీల్లో పేరం టాలపల్లి, టేకుపల్లి, గ్రామాల్లో లాంచీ ప్రయాణం ద్వారా పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, పలువురు అధికారులు పర్యటిం చారు. ప్రజలెవ్వరూ భయభ్రాంతులకు గురికా వద్దని ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే బాలరాజు బాధితులకు భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో బాధిత కుటుంబాలకు నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. వేలేరుపాడు మండలంలో వరద ప్రభావిత గ్రామాలైన 15 గ్రామాల్లోని 943 కుటుంబాలకు నిత్యావసర వస్తువులు మంగళ,బుధ వారాల్లో పంపిణీ చేసినట్టు తెలిపారు. బియ్యం,25 కేజీలు, కందిపప్పు కిలో, లీటర్ ఆయిల్, కిలో పంచదార, కిలో బంగాళ దుంపలు, కిలో ఉల్లిపాయలు అందించినట్టు పేర్కొన్నారు. వీరి వెంట

జంగారెడ్డిగూడెం ఆర్డీవో కె. అద్దయ్య, డిఎస్ఓ ఆర్.ఎస్.ఎస్. రాజు, తహశీల్దారు డివి సత్యనారాయణ, చల్లన్నదొర, తదితరులు పాల్గొన్నారు.

PASSPORT LOST

GADIRAJU VENKATA SATYANARAYANA RAJU, S/o. SATYANARAYANA RAJU, D.No.17-6, Near Railway Gate, Gandhi nagar, Undi Village, Undi Mandal, W.G.Dt., I have recently lost my original PASS PORT with Bearing No: **A6897286** lost by me on **26-08-2024** while I am going from house to xerox shop Undi main road.So if anybody finds kindly inform to above Address or Cell Number.

Cell No: **98496 13399**

3ఎఫ్ స్వాభిమాన్ ఫౌండేషన్ ఔదార్యం

వరద బాధితులకు 5వేల భోజనం ప్యాకెట్లు పంపిణీ

విశాలాంధ్ర- పెంటపాడు: పశ్చిమగోదావరి జిల్లా పెంటపాడు మండలం ప్రత్తిపాడు ఫుడ్ ఫ్యాట్స్ అండ్ ఫెర్టిలైజర్స్ 3 ఎఫ్ స్వాభిమాన్ ఫౌండేషన్ వారు

తమ ఔదార్యం చాటుకున్నారు. సేవే పరమావధిగా ముందడుగు వేస్తూ పలు సేవా కార్యక్రమాల్లో తమదైన శైలిలో ముందడుగు వేస్తున్నారు. ఇదే కోవలో ఇటీవల కృష్ణా జిల్లాలో వరదల్లో చిక్కుకున్న ప్రజలకు ఈరోజు 3ఎఫ్ వారి స్వాభిమాన్ ఫౌండేషన్ సేవా సంస్థ ద్వారా వరద బాధితులకు ఆహారం పంపిణీ చేశారు. సుమారు ఐదువేలు ఆహార పేకెట్లను 3ఎఫ్ సంస్థకు చెందిన తమ సొంత వ్యాన్ లో రెవిన్యూ అధికారులు పెంటపాడు తహసీల్దార్ ఏడిద శ్రీనివాస్ ద్వారా కృష్ణా జిల్లాకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 3ఎఫ్ హెచ్ ఆర్ సత్యనారాయణ, మేనేజర్లు వేమల శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి, 3ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

వరద బాధితులకు అండగా నిలవాలి

విశాలాంధ్ర -తణుకు : వరదలు, వర్షాలతో సతమత మవుతున్న విజయవాడ ప్రజలకు చేయూత అందించి వారికి అండగా నిలవాలని తణుకు శాసనసభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణ కోరారు. బుధవారం ఆయన విజయవాడ 32 వ డివిజన్ అయోధ్య నగర్ లో వరద బాధితుల దగ్గరకు వెళ్లి వారికి కావలసిన నిత్యావసర వస్తువులు, పాలు, టిఫిన్ ,బిస్కెట్స్ ,వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు.

గణపవరం ఎస్ఐగా మణికుమార్

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం ఎస్ఐగా మణికుమార్ బుధవారం బాధ్యతలు తీసు కున్నారు. గణపవరం పోలీస్ స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉందని ఆ సమస్యను పరిష్కరించ టానికి కృషి చేస్తానని ఆయన అన్నారు. స్టేషన్ పరిధిలో కోడిపందాలు జూదం ఆడితే వారిపై చర్యలు తీసుకుంటామని, శాంతి భద్రతలు పరిరక్షిస్తానని ఏదైనా సమస్య వస్తే ఇరుపక్షాల వారికి న్యాయం జరిగేలా చూస్తానని పేర్కొన్నారు.

గోదావరి ముంపు ప్రాంతాల్లో కలెక్టర్ పర్యటన

విశాలాంధ్ర-అల్లవరం : గోదావరి వరదలు, భారీ వర్షాలు ఎదుర్కొని సన్నద్ధ తను కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పరిశీలించారు.ఓడలరేవులోని ఫిషరీస్ జెట్టిను పరిశీలించి వివరాలు తెలుసుకుని, అభివృద్ధి చేయుటకు పలు సూచనలు చేశారు. అనంతరం వరదల సమయంలో ముంపు సమస్యకు కారణం అవుతున్న గోపాయ లంక ఔట్ ఫాల్ స్లుయిస్ పరిశీలించి పాడైన షట్టర్లు స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసి రైతులకు, సమీప గ్రామాలకు ముంపు ఇబ్బందులు లేకుండా చూడటానికి తగు చర్యలు చేపట్టాలని హెడ్ వర్క్స్, ఇరిగేషన్, డ్రెయిన్స్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ బి కృష్ణ మోహన్, తహసీల్దార్ ఎస్ వి ఎస్ నరసింహ రావు, ఇరిగేషన్, డ్రైన్, ఆర్ ధబ్ల్యూ ఎస్, పి ఆర్ ఇంజనీర్లు రెహమాన్, సునీత, స్వామి, సంపన్న ఓడల రేవు, గోడి తిప్ప, బోడ సుకుర్రు సర్పంచులు, విఆర్ఓ లు, కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు అనూరాధ ఎంపిక

విశాలాంధ్ర - అనపర్తి : స్థానిక వీరుళ్ళమ్మ గుడి వద్ద ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సత్తి అనూరాధ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక య్యారు. 1998 ఆగస్టు 15న సెకండరీ గ్రేడ్ టీచర్‌గా అనూరాధ ఉపాధ్యాయ వృత్తిని చేపట్టారు. తోటి ఉపాధ్యాయుల సహకారం తో ఆయా పాఠశాలలను అభివృద్ధి చేస్తూ విద్యార్థుల బంగారు భవిష్యత్తును తీర్చిదిద్ద దానికి ఎంతో కృషిచేసి అందరి మన్ననలు పొందారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన సత్తి అనూరాధని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, టిడిపి మండల అధ్యక్షులు కొవ్వూరి శ్రీనివాసరెడ్డి (దత్తుడు శ్రీను), కర్రి వెంకటరామారెడ్డి, సిరసపల్లి నాగేశ్వరరావు, ఇంకా పలువురు ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు అభినందించారు.

గణేష్ ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరి

విశాలాంధ్ర - రావులపాలెం : రావులపాలెం మండలంలోని 21 గ్రామాల్లో త్వరలో జరగబోయే వినా యక చవితి ఉత్సవాలను పండుగ వాతావరణంలో అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని సీఐ జేమ్స్ రత్న ప్రసాద్ సూచించారు.ఈ ఏడాది చవితి ఉత్సవాల వివరాలను తెలుసుకునేందుకు ప్రభుత్వం సింగిల్ విండో విధానాన్ని అమలు చేసిందని వివరించారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వినాయక చవితి పందిళ్లు ఏర్పాటు కోసం వినాయక ఉత్సవ కమిటీలుhttps://ganeshutsav.netగాని ఫోన్ నెంబర్ 79950 95800 వాట్సాప్ నంబర్‌ను అనుమతి కోసం సంప్రదిస్తే మీ నంబర్ కు వచ్చే లింక్ పై క్లిక్ చేసిన తరువాత మీకు ఓటిపి వస్తుం దని వివరించారు. అనుమతి కోరుతూ దరఖాస్తు కోసం గూగుల్ ఫారం ఓపెన్ చేసి అందులో ఉన్న కాలమ్స్‌ను పూర్తి చేసిన తర్వాత ఆ దర ఖాస్తు ఆధారంగా పోలీసులు విచారణ చేసి సింగిల్ విండో పద్ధతి ప్రకారం అను మతి మంజూరు చేయనున్నట్టు తెలిపారు. పోలీస్ నిబంధనల ప్రకారం ఇచ్చి న అనుమతి పత్రాన్ని, మందిరం ఆవరణంలో అతికించాలన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు

విశాలాంధ్ర - కరప : జిల్లా విద్యాశాఖ ఉపాధ్యాయులకు ప్రతి సంవత్సరం అందించే ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు కరప మండలం వివిధ జిల్లా పరిషత్ స్కూల్స్ నుంచి నలుగురు ఉపాధ్యాయులు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక అయ్యారు. వీరిలో వాకాడ వెంకటరమణ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపిక కాగా, ప్రస్తుతం నడకుదురు జిల్లా పరిషత్ హై స్కూల్ నందు వెంకటరమణ పనిచేయుచున్నాడు. యండమూరి ప్రాథమికోన్నత పాఠశాల నందు పనిచేస్తున్న బి పద్మావతి కి ఉత్తమ ఉపాధ్యాయురాలుగా అవార్డు దక్కింది. వై సువర్చలదేవి కి ఉత్తమ ఉపాధ్యాయురాలు అవార్డు వచ్చింది. ప్రస్తుతం గొర్రిపూడి జిల్లా పరిషత్ హై స్కూల్ నందు పని చేస్తున్నారు. సిహెచ్ కృష్ణ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక అయ్యారు.

నామినేటెడ్ పదవుల్లో

మత్స్యకారులకు అవకాశం దక్కేనా...?

విశాలాంధ్ర - కాకినాడ : రాష్ట్రంలో ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం విజయానికి ఓ సామాజిక వర్గం ప్రముఖపాత్ర పోషించిందన్న సంగతి తెలిసిందే. అదే మత్స్యకార సామాజిక వర్గం. గత కొంతకాలంగా తెలుగుదేశంపార్టీకి వెన్నుదన్నుగా నిలిచిన సామాజికవర్గంగా మత్స్యకారవర్గానికి పేరుంది. మత్స్యకార సామాజికవర్గానికి చెందిన ఎమ్మెల్యేల విజయంలోనూ వీరిపాత్ర ప్రత్యేకంగా చెప్పుకోవచ్చు. తూర్పుగోదావరి జిల్లాలో మత్స్యకారవర్గానికి చెందిన ఎమ్మెల్యేను గెలిపించడంలో వారి పాత్ర కనిపిస్తుంది. అలాగే ఎన్నికల్లో కూటమి విజయం తర్వాత మత్స్యకార వర్గానికి చెందిన టీడీపీ ఎమ్మెల్యేకు మంత్రిపదవి కూడా లభించింది. అదే తరహాలో జనసేన తరపున కూటమి గెలుపునకు తమవంతు కృషిచేసిన మత్స్యకార వర్గానికి చెంది, తిరుమల తిరుపతి దేవస్థానం ప్రతిష్టను పరిరక్షించే అవకాశం వస్తుందని పలువురు భావిస్తున్నారు. దీనిపై రాష్ట్రముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పందించి తూర్పుగోదావరి జిల్లాలో మత్స్యకారులు ఆశిస్తున్న టీటీడీ బోర్డు మెంబరుగా అవకాశం కల్పిస్తారని జిల్లా మత్స్యకార ప్రముఖులు అభిప్రాయపడడం గమనార్హం.ఇదిలా వుండగా తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు మెంబరుగా గత వైసీపీ ప్రభుత్వంలో 2023 సంవత్సరంలో కోనసీమ జిల్లాకు చెందిన పొన్నాడ సతీష్ కు అవకాశం కల్పించింది. నేడు కూటమి ప్రభుత్వంలో రాష్ట్రంలో మత్స్యకారుల పాత్ర ఎంతైనా వుందని మత్స్యకార వర్గీయులు అభిప్రాయపడుతున్నారు. రానున్న నామినేటెడ్ పోస్టుల నియామకాల్లో తూర్పుగోదావరి జిల్లా నుంచి మళ్లీ అదే సామాజికవర్గానికి అవకాశం లభిస్తుందని పలువురు మత్స్యకారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

చవితి ఉత్సవాల అనుమతులకు దరఖాస్తు చేసుకోవాలి

విశాలాంధ్ర - అల్లవరం : వినాయక చవితి ఉత్సవాలకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని వినాయకుని విగ్రహాల ఏర్పాటు విద్యుత్ మైక్ పరిమిషన్లు ఎప్పటిలాగే ముందుగా అనుమతులు కోసం ఆలయ కమిటీ నిర్వాహకులు దరఖాస్తు చేసుకోవాలి.వినాయక విగ్రహాల నిమజ్జనం సమయంలో ఆలయ కమిటీ నిర్వాహకులు శాంతిభద్రతలకు ఎటువంటి విఘాతం కలగకుండా చర్యలు తీసుకోవాలి.రోడ్లపై దేవుని పేరిట చందాలు వసూలు చేసేటప్పుడు ఎవరిని డిమాండ్ చేయకుండా దేవుని కోసం ఎవరైనా స్వచ్ఛందంగా చందాలు ఇస్తేనే తీసుకోవాలని వినాయక ఉత్సవాలు పేరిట రాత్రి సమయాల్లో రికార్డింగ్ డాన్సులు గాని చట్ట విరుద్ధమైన పనులు ఎవరైనా పాల్పడితే ఉపేక్షించేది లేదు.అలా చేస్తే ఆలయ నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తామని వినాయకుని ఆలయాలు వద్ద పూర్తి భద్రత ఆలయ కమిటీ నిర్వాహకులే బాధ్యత వహించాలి. నిమజ్జనం రాత్రి 10 గంటల్లోపు పూర్తిచేయాలి నిమజ్జనం చేసేటప్పుడు మద్యపానం సేవించరాదు.నిమజ్జనం చేసేటప్పుడు బాణాసంచా కాల్చ రాదు.ఎక్కడైనా ఆలయాల వద్ద రికార్డింగ్ డాన్సులు గాని చట్ట విరుద్ధమైన కార్యక్రమాలు చేపడితే వెంటనే 9490760764నంబర్ కు తెలియపర చండి. తెలియపరిచిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక

ఉత్తమ ఉపాధ్యాయురాలిగా శ్యామలాకుమారి

విశాలాంధ్ర - గండేపల్లి : మండలం నుండి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా యాశాలపు శ్యామల కుమారి ఎన్నికయ్యారు .వీరికి 5న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కాకినాడలో జిల్లా కలెక్టర్ వారి చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ప్రధానం జరుగుతుందని ఎంఈఓ తెలిపారు. మండలంలో మురారి నంబర్ 03 పాఠశాలలో శ్యామల కుమారి 2021 జనవరి నుండి సెకండ్ గ్రేడ్ ఉపాధ్యాయులుగా పనిచేస్తూ తరగతి వారి విద్యా బోధన , ప్రభుత్వ పథకాల అమలు, నాడు నేడు కార్యక్రమాలు అన్నిటిని సమర్ధవంతంగా నిర్వహిస్తూ గ్రామంలోని విద్యార్థి విద్యార్థుల తల్లిదండ్రుల చేత ప్రశంసలు పొందారు.ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి కె హెచ్ నాయక్, వెంకట రెడ్డి శ్యామల కుమారికి శుభాకాంక్షలు తెలిపారు.

సామర్లకోటలో ఇద్దరు ఎంపిక :

సామర్లకోట : మండలంలో ఈ ఏడాది ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు ఇద్దరు ఉపాధ్యాయులు ఎంపికైనట్టు మండల విద్యాశాఖధికారి2 పుల్లయ్య బుధవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. సామర్లకోట మండలం కాపవరం మండల పరిషత్ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న అద్దంకి వెంకన్నబాబు, వేట్లపాలెం గ్రామంలోని మండల పరిషత్ నెంబర్ 1 పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న కె బాలరామ్ చౌదరి లు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైనట్టు తెలిపారు. వీరు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా 5న గురువారం జిల్లా ఉన్నతాధికారులు చేతులమీదుగా పురస్కారాలు అందుకోనున్నట్టు తెలిపారు. కాగా ఉత్తమ పురస్కారాలకు ఎంపికైన ఉపాధ్యాయులకు మండల విద్యాశాఖధికారి1 వై శివరామ కృష్ణయ్య, తదితరులు అభినందనలు తెలిపారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా ఆదినారాయణమూర్తి ఎంపిక



విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలా నికి చెందిన జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల కోరంగిలో ఎస్ఎమ్స్‌గా పని చేస్తున్నటువంటి ఆకుల ఆదినారాయణ మూర్తికి 2024 సంవత్సరానికి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపిక అయినట్టు జిల్లా విద్యాశాఖ అధికారులు నిర్ణయించి ఉన్నారు. ఈ సందర్భంగా ఆకుల ఆదినారాయణ మూర్తిని పాఠశాల విద్యా కమిటీ చైర్మన్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు.

ముంపునీటి తొలగింపు

చర్యలు చేపట్టాలి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - రాజోలు : భారీ వర్షాల కారణంగా రాజోలు నియోజకవర్గంలోని రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి మామిడికుదురు మండలంలోని ఏడు గ్రామాలలో మండల, గ్రామ స్థాయి అధికారులు ముంపునకు గురైన కాలనీల్లో ముంపు నీటిని తొలగించేలా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన మలికిపురం లో కార్యాలయం నుండి ఒక ప్రకటన విడుదల చేశారు. ముంపు నీటిని తొలగించుటకు వీలుగా అవసరమైనచోట జిరాయితీ భూముల రైతులతో మాట్లాడి ముంపు నీరు డ్రెన్‌లోకి వెళ్లే విధంగా మళ్లింపు చర్యలు చేపట్టాలని కూటమి నాయకులకు సూచించారు.

ఎమ్మెల్సీ కుడిపూడికి

జర్నలిస్టుల పరామర్శ

విశాలాంధ్ర - అమలాపురం : మోకాలు శస్త్ర చికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న ఎమ్మెల్సీ కుడిపూడి సూర్యనారాయణను ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు కొండేపూడి సత్యనారాయణ, ఎమ్.డి.బషీర్. ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షులు అప్పాజీ, ప్రెస్ క్లబ్ మాజీ అధ్యక్షులు రంబాల నాగ సత్యనారాయణ, దడాల త్రిమూర్తులు, ఎన్.శర్మ తదితరులు పరామర్శించి కుడుపూడి ఆరోగ్యం పరిస్థితిని వారు అడిగి తెలుసుకున్నారు త్వరగా కోలుకుని జన సేవలోకి రావాలని ఆకాంక్షించారు.

కాలనీలో వరదనీరు తొలగింపు

విశాలాంధ్ర - కరప : మండలంలో గొర్రిపూడి గ్రామంలో అల్పపీడన ప్రభావంతో ఎస్సీ పేట ఇందిరా కాలనీలో వీధులన్నీ నీటమునిగిపోవడంతో కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ఆదేశాల మేరకు జనసేన పార్టీ మండల అధ్యక్షులు బందారు మురళి అధికారులతో జెసిబిలు సహాయంతో నీటిని తొలగించారు. రాంబాబు, కోఆప్షన్ సభ్యులు వెంకటేశ్వరరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చరిత్ర అతిథి అధ్యాపక పోస్టు

భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర - ఆలమూరు : స్థానిక ఆలమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న హిస్టరీ జూనియర్ లెక్చరర్ పోస్టునకు గాను అతిథి అధ్యాపకుని నియామకమునకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇంచార్జ్ ప్రిన్సిపాల్ కృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. చరిత్ర సబ్జెక్టుగా 50శాతం మార్కులతో పి.జి. ఉత్తీర్ణులై, ఆసక్తి గల వారు ఈ నెల 6న ఉదయం పది గంటలకు సంబంధిత ధృవపత్రాలతో ఇంటర్వ్యూకు హాజరుకావలసి ఉన్నదని, ఈ నియామకము పూర్తిగా తాత్కాలికమని కళాశాల ప్రిన్సిపాల్ అన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

విజయవాడ ముంపు బాధితులకు ఆహారం పంపిణీ

విశాలాంధ్ర - అనపర్తి : కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో సంభవిం చిన విపత్తుతో విజయవాడ పరిసర ప్రాంతాలు ముంపునకు గురయ్యి అనేకమంది నిరాశ్రయులయ్యారు. ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలో పెద్ద ఎత్తున సహాయ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం వరద బాధితులకు బుద్ధవరపు చారిటబుల్ ట్రస్ట్, బల భద్రపురం షిరిడి సాయి ఆలయం, శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానం కమిటీ సిద్ధం చేసిన సుమారు 10 వేల ఆహార పొట్లాల పంపిణీ చేస్తున్న వాహనాలకు స్థానిక దేవి చౌక్ సెంటర్లో జెండా ఊపి ఎమ్మెల్యే నల్లమిల్లి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కొవ్వూరి శ్రీని వాసరెడ్డి (దత్తుడు శ్రీను), కర్రి వెంకటరామారెడ్డి, సిరసపల్లి నాగేశ్వరరావు, సత్తి దేవదానరెడ్డి, ఓగిరెడ్డి రాధ తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం: మండలంలోని తహశీల్దార్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది సహాయ సహకారంతో విజయవాడ వరద బాధితులకు 1500 ఆహార పొట్లాలు, మజ్జిగ పాకెట్స్, వాటర్ పాకెట్స్‌లను బుధవారం పంపించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ ఏ శ్రీనివాస్ మాట్లాడుతూ రెవెన్యూ సిబ్బంది సహాయ సహకారంతో వరద బాధి తులకు మా వంతు సహాయంగా అహార పొట్లాలను పంపించామని అని అన్నా రు. వరద బాధితులకు ఎవరికి తోచిన సహాయం వారు చేయాలని కోరా రు. ఈ కార్యక్రమంలో మూర్తి, అర్ఐ లక్ష్మీదేవి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పెరవలి : పెరవలి తహశీ ల్దార్ కార్యాలయం అధికారులు , సిబ్బంది విజయవాడలో ముంపునకు గురైన ప్రాంతానికి తీసుకు వెళ్లి ఆహార పదా ర్థాలను పంచిపెట్టి నట్లు రెవెన్యూ బుధవారం అధికా రులు తెలిపారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ డిప్యూటీ తహసీల్దార్ ఆర్ఐ విఆర్వోలు పాల్గొన్నారు.

వరద భాదితులకు బివిసి విద్యాసంస్థల ఉదారత

అమలాపురం : వరద బాధితులకు బివిసి విద్యా సంస్థలు 5 లక్షల విరాళం అందజేసాయి.బీవీసీ అధినేత బోనం కనకయ్య విజయవాడ వరదల్లో నష్టపోయిన భాధితులను ఆదుకోనేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పిలుపు మేరకు వరద బాధితులకు తమ వంతు చిరు సాయంగా ఆదుకునేందుకు బివిసి విద్యా సంస్థలు ముందుకు వచ్చాయి. తమ సంస్థల తరుపున ఐదు లక్షల రూపాయలు అందిస్తున్నట్లు బివిసి విద్యాసంస్థల చైర్మన్ బోనం కనకయ్య తెలిపారు.

విద్యుత్ మీటర్ రీడర్స్ ఆందోళన విరమణ

విశాలాంధ్ర - భీమవరం : విద్యుత్ మీటర్ రీడర్ల వేతనాలు ఎగ్రో అకౌంట్స్ ద్వారా చెల్లించడానికి అధికారులు అంగీకరించినందున విద్యుత్ మీటర్ రీడర్స్ విధులు బహిష్కరణ విరమించుకున్నట్టు ఏఐటీయూసీ పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షులు,విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు కోనాల భీమారావు తెలిపారు. బుధవారం భీమవరంలో ఆయన మీడియాకు ఒక ప్రకటన విడుదల చేసి మాట్లాడుతూ ఎగ్రో అకౌంట్స్ ఓపెన్ చేసి వేతనాలు చెల్లింపులకు అంగీకరింప చేసిన సిఎండి , ఎస్.ఇ, డి.ఇ.ఇ ఇతర అధికారులకు భీమారావు కృతజ్ఞతలు తెలిపారు.

మండలంలో 580ఎకరాల్లో పంట నష్టం

విశాలాంధ్ర-సామర్లకోట : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్ప పీడనం ప్రభావంతో వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు అన్నదాతలకు కష్టాలు తెచ్చి పెట్టాయి. చెరువులు, కుంటలు నిండుతున్నాయని కొందరు హర్షిస్తుండగా, మరి కొందరు మాత్రం చేతికి రావలసిన పంట నీట మునిగి పోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలో ప్రధాన సాగు అయిన వరి ప్రస్తుత వర్షాలు వలన నీట మునిగి తీవ్ర నష్టం ఏర్పడుతుందని పలువురు రైతులు ఆందోళన చెందుతున్నారు. అయితే సామర్లకోట మండలంలో సుమారు 580 ఎకరాల్లో వరి సాగు పంట నష్టం ఏర్పడినట్లు మండల వ్యవసాయ అధికారి ఇమిడి సెట్టి సత్య స్పష్టం చేశారు. వర్షాలకు ముంపునకు గురైన వరి పొలాలను ఆమె సిబ్బందితో కలిసి పరిశీలించి రైతులతో మాట్లాడారు. ప్రస్తుతం వరి పంట పిలకల తొడిగే దశలో ఉన్నందున రైతులందరూ పొలంలో నుండి వెంటనే నీరును తొలగించి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏవో సత్య సూచించారు. సామర్లకోట మండలంలోని నవర, పవర, గొంచాల, చంద్రంపాలెం, పండ్రవాడ, ఉండూరు, ప్రాంతాల్లో వరి పొలాలను ఆమె పరిశీలించి సుమారు 580ఎకరాల్లో వరిపంట నీట మునిగినట్టు అంచనా వేశారు. సస్యరక్షణ చర్యలకు తగిన సూచనలు పొందేందుకు తమను రైతులు సంప్రదించాలని ఏవో సత్య రైతులకు తెలిపారు.

తప్పనిసరిగా పంటనమోదు, ఈకేవైసీ చేసుకోవాలి

వర్షానికి మునిగిన పంటలను పరిశీలించిన అధికారులు

విశాలాంధ్ర - పిఠాపురం : మండలంలోని పి దొంతమూరు, వెల్దుర్తి, పి రాయవరం, పి తిమ్మాపురం గ్రామములలో అధిక వర్షముల వలన దెబ్బతిన్న వరి పంటలను పిఠాపురం సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు పి.స్వాతి పరిశీంచారు. రైతులు, వ్యవసాయ సహాయకులు, వీఆర్వోలతో చర్చించి ప్రాథమిక పంట నష్టము గురించి అడిగి తెలుసుకున్నారు. మండలంలో సుమారు 320 హెక్టార్ల పరిధిలో పంట నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనా మండల వ్యవసాయ అధికారి అచ్యుతరావు కి ఆమె తెలియజేశారు. ముంపు నీటిని వీలైనంత త్వరగా మురుగు కాల్వల ద్వారా బయటకు పంపి 20 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్ ఎరువులకు వేసుకొన్నట్లైన పంట త్వరగా కోలుకొను అవకాశం ఉంటుందని రైతులకు ఆమె సూచించారు. మాగుడు తెగులు సోకి కాండము మెత్తబడే అవకాసం ఉంది కావున మాంకోజెబ్ మందును 3 గ్రాములు లీటరు నీటికి లేదా వాలిడామైసిన్ 2మి.లీ. లీటరు నీటికి కలిపి వాడుకొన వలసినదిగా రైతులకు ఈ సందర్భంగా ఆమె తెలిపారు. వ్యవసాయ శాఖ ద్వారా పంటనష్టం పరిహారం రావాలంటే తప్పనిసరిగా పంట నమోదు, ఈకేవైసీ చేసుకొవాలని రైతు లందరికీ ఈ సందర్భంగా ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఏఓ ఏ.అచ్యుతరావు, సంబంధిత విఏఏలు పాల్గొన్నారు.

అమలాపురంలో బీజేపీ సభ్యత్వ నమోదు

విశాలాంధ్ర- అమలాపురం : డా.బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా బీజేపి సభ్యత్వ నమోదు కార్యక్రమం బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ అధ్యక్షతన బుధవారం డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నమోదు కార్యక్రమం అమలాపురం ప్రెస్ క్లబ్‌లో సమావేశం నిర్వహించారు.రాష్ట్ర ఉపాధ్యక్షులు వేటుకూరి సూర్య నారాయణ రాజు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి సభ్యత్వ నమోదు చేసారు . ప్రముఖ బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలూరి సత్యానందం జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకట సుబ్బారావు మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి దొంగ గంగా భవాని, బండి శ్రీనివాస్ జగతా శాంతి కాళ్ల కూరి గోపి తదితరులకు సభ్యత్వం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్లమెంట్ కన్వీనర్ విళ్ళ సత్యనారాయణ, సీనియర్ నాయకులు ఆర్ వి నాయుడు, గనిశెట్టి వెంకటేశ్వరరావు , విళ్ల వెంకటేశ్వరరావు, చీకురుమల్లి శ్రీనివాసరావు, ఆకుల వీరబాబు, ఆడపా శ్రీను, గొలకోటి వెంకటరెడ్డి, గ్రంధి నానాజీ, చిలకమర్రి కస్తూరి కొండేటి ఈశ్వర్ గౌడ్, చెరుకూరు గోపాలకృష్ణ , ఎర్రంశెట్టి సాయిబాబు, సుంకర సాయి దేగల వెంకటరమణ, అరిగెల తేజ వెంకటేష్, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, గుమ్మల రెడ్డి నాయుడు బచ్చు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

విశాలాంధ్ర - గండేపల్లి : మండలంలో మల్లేపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద రాజమహేంద్రవరం గౌతమి నేత్రాలయం వారిచే ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కంటి వైద్య శిబిరం గ్రామ సర్పంచ్ బలిరెడ్డి వరలక్ష్మి గంగరాజు ఆధ్వర్యంలో, సీనియర్ వైద్యాధికారిణి సత్య, హాస్పటల్ సిబ్బంది అధ్యక్షతన పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గౌతమి నేత్రాలయం నుంచి ప్రత్యేక కంటి వైద్య సేవలు నిర్వహించడానికి వచ్చారని, అర్హులైన ప్రతి పేదవానికి సమగ్ర కంటి చికిత్స చేసి గౌతమి నేత్రాలయం వారిచే ఉచితంగా కంటికి ఆపరేషన్ చేస్తారని అన్నారు. కొయ్యకండ, రెటీనా ఆపరేషన్లు, కార్నియా మార్పిడి, శుక్లములు, నీటి కాసులు, మెల్లకన్ను హాస్పటల్ నందు అందుబాటులో గల నగదు రహిత వైద్య సేవలు అందించబడతాయన్నారు. ఈ కార్యక్రమంలో బలిరెడ్డి శివ శ్రీధర్ ప్రోగ్రామ్ మేనేజర్లు గోపి, గురు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాకినాడలో 15 అడుగుల పంచదార గణపతి

విశాలాంధ్ర - కాకినాడ : ప్రకృతికి అద్దంపట్టే రీతిగా సహజ సిద్ధ పద్ధతుల్లో గణపతి విగ్రహాలు తయారు చేసి ఆదర్శప్రాయంగా నవరాత్రులు చేసే వారిని ప్రభు త్వం గుర్తించి ప్రోత్సాహక జ్ఞాపి కలు ఇవ్వాలని నగర గణేశ ఉత్సవ సమితి గౌరవ అధ్యక్షులు సామా జిక వేత్త దూసర్లపూడి రమణరాజు కూటమి అధినేతలను కోరారు. కాకినాడ జగన్నాథ పురం నేతాజీ పార్కు రోడ్డులో పది మంది ఉపాధి కూలీలు సిద్ది వినాయక విశాఖ ఫెండ్స్ సర్కిల్ ఆధ్వ ర్యంలో లక్ష ఇరవేవేలు వెచ్చించి 1200కేజీల పంచదారతో 15అడుగుల గణపతి విగ్రహాన్ని చీరాలకు చెం దిన ఏడు గురు కళాకారులతో వారం రోజులు కృషిచేసి తయారు చేయించి నెలకొల్పడం అద్భుత మన్నారు. పాస్టర్ ఆఫ్ పారిస్ లెడ్ వంటి విష పూరిత రంగు రసాయ నాలు వాడకుండా గణపతి స్వరూపం రూపొందించి విఘ్నేశ్వ ర ప్రతిమ నిలపడం కాకినాడ జిల్లా కేంద్రా నికే గొప్ప ఆదర్శప్రాయ మన్నారు. గత ఏడాది నవధాన్యాలతో తయా రు చేశారన్నారు. 10వ వార్షిక ఉత్సవంగా 7 నుండి 15 వరకు నిత్య అన్నదానం ఏర్పాట్లు చేపట్టడం మరింత అభినం దనీయమన్నా రు. ప్రకృతి తత్వంతో మట్టి విగ్రహాలు నిలిపే విధంగా కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు దేవాదాయ ధర్మాదాయ శాఖ ద్వారా రాయితీలు ఇచ్చి మట్టి విగ్రహాలు తయారు చేసే కళాకారులకు చిన్న తరహా కుటీర పరిశ్రమల తర హాలో నెల కొల్పే చర్యలు రానున్న భవిష్యత్తులో చేపట్టాలని కోరారు. పర్యావరణ హితం కోసం పాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను క్రమేణా తగ్గించాలన్నారు.మజ్జి సత్యప్రసాద్, సంతోష్ కుమార్, మద్దు శ్రీనివాసరావు, వాసా శ్రీను, నలమశెట్టి సురేష్, కోకల దుర్గారావు, పబ్బినీడి వీరబాబు, నేమాల సురేష్, నల్లాకుల శ్రీనివాస్, మెండ శ్రీనివాస్, అనిశెట్టి వీర బాబ, సురేష్ మున్నగు వారు రోజు వారీ తమ సంపాదనలో 50శాతం మొత్తాన్ని కేటాయించుకుని దాతల సహకారంతో 7లక్షల రూపాయల ఖర్చుఉత్సవాల నిర్వహణ చేస్తున్నారు.

బీజేపీ సభ్యత్వాల నమోదు

విశాలాంధ్ర - పెదపూడి : భారతీయ జనతా పార్టీ సిద్ధాంతపరమైన పార్టీ అని ఏకత్వ మానవతా ధర్మాన్ని పాటిస్తుందని ఎమ్మెల్యే నల్ల మిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం కాకినాడ జిల్లా బిజెపి కార్యాల యంలో బిజెపి సభ్యత్వాల నమోదు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నల్లమిల్లి ప్రారంభించి మొదటి సభ్యత్వం జిల్లా బిజెపి అధ్యక్షులు చిలుకూరి రామ్ కుమార్‌కి అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నల్లమిల్లి మాట్లా డుతూ ప్రతి పోలింగ్ బూత్ లో కనీసం 200 మందితో సభ్యత్వం చేయిం చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మాజీ అధ్యక్షులు మాలకొండయ్య, విశ్వనాధపల్లి శ్రీనివాసరాజు, విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

విశాలాంధ్ర - గండేపల్లి : ఆగి ఉన్న ట్యాంకర్ లారీని వెనకనుంచి ఢీకొట్టిన ప్రమాదం లో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెం దాడు. పోలీసులు తెలిపిన వివ రాల ప్రకారం బుధవారం ఉద యం 10 గంటల సమయంలో అనకాపల్లి జిల్లా కోట ఊరట్ల మండలం కరణం కొత్తూరు గ్రామానికి చెం దిన కరణం నవీన్ (22) రాజమండ్రి నుండి తన స్వగ్రామం కు మోటార్ సైకిల్ పై వెళుచుండగా గండేపల్లి మండలం నీలాద్రి రావు పేట గ్రామ శివారులో వచ్చేసరికి +జి 12డీఎ 6001 నెంబర్ గల ట్యాంకర్ డ్రైవర్ ఎన్ హెచ్ 16 రోడ్డుపై ఎటువంటి జాగ్రత్తలు పాటించకుండా పార్క్ చేసి ఉండటం వలన అది గమ నించకుండా వెనుక వస్తున్న కరణం నవీన్ సదరు ట్యాంకర్ వెనుక వైపు గుద్దగా తలకు బలమైన గాయమై నవీన్ అక్కడికక్కడే మృతి చెం దాడు. దీని పై మృతుడు చిన్నాన్న కరణం కృష్ణ ఇచ్చిన రిపోర్ట్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గండేపల్లి ఎస్సై శివ నాగబాబు తెలిపారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్ సీజ్

విశాలాంధ్ర - సీతానగరం: మండ లంలో రాపాక గ్రామ పంచాయితీ పరిధిలో గంగాలమ్మ మెట్టకు వెళ్లే రహదారి లో మంగ ళవారం రాత్రి అక్రమంగా ఇసు కను తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకు న్నారు. ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి రెవెన్యూ అధికారులు అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అక్రమ ఇసుక రవాణా చేస్తే చట్ట పరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వరద బాధితులకు స్వయం సహాయక సంఘాల మహిళల సాయం

విశాలాంధ్ర - కాకినాడ, రావులపాలెం : డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా స్వయం సహాయక సంఘాల మహిళల ఆధ్వర్యంలో విజయవాడ వరద బాధితులకు బిస్కెట్ ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లు పంపిణీ ఆంధ్రప్రదేశ్ సెర్ప్ సీఈవో సూచనల మేరకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని స్వయం సహాయక సంఘాల మహి ళలు, జిల్లా సమాఖ్య ఆధ్వర్యంలో రెండు లక్షల రూపాయల విలువైన 20వేల బిస్కెట్ ప్యాకెట్లు, 20 వేల వాటర్ బాటిళ్లు (అర లీటర్) ను విజయ వాడ వరద సహాయ బాధితు ల కు బుధ వారం పంపించినట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ పి శివ శంకర ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. బిస్కెట్ ప్యాకెట్లు, వాటర్ బాటి ళ్లను ప్రత్యేక వాహనం ద్వారా రావులపాలెం నుంచి విజయవాడకు పంపినట్లు పిడి తెలిపారు. ఆపదలో ఉన్న వ్యక్తులకు సహాయం చేయాలన్న ఉన్నతమైన ఆలోచనతో ముందుకు వచ్చి తమ వంతు సహాయం అందించిన స్వయం సహాయ సంఘ మహి ళలను, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా సమాఖ్యను జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ టి నిషాంతి అభినందించారు. ఈ కార్యక్రమం లో జిల్లా సమాఖ్య ప్రెసిడెంట్ జి సుమ లత, జాయిం ట్ సెక్రెటరీ రాజేశ్వరి, స్త్రీ నిధి డైరెక్టర్ వెంకటలక్ష్మి, డిపిఎం అన్నపూర్ణ, స్త్రీ నిధి ఏజీఎం ప్రసన్నలక్ష్మి, ఏపీ యంలు విశ్వనాథ్, అర్జున్ కొత్తపేట మండల సమాఖ్య సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలే జగనన్న కాలనీలో
చట్టవ్యతిరేక కార్యకలాపాలు

విశాలాంధ్ర - తాళ్లరేవు :మండలంలో నీలపల్లి జగనన్న కాలనీలో పట్టపగలే వ్యభిచారం నిర్వహిస్తున్న ఇద్దరు మహిళ లను ఒకవ్యక్తిని కోరంగి పోలీసులు అదుపు లోకి తీసుకున్నారు. కోరంగి ఎస్సై పి సత్య నారాయణ తెలిపిన వివరాల మేరకు కొంత కాలంగా జగనన్న కాలనీలో వ్యభిచారం నిర్వహిస్తున్నారని స్థానికులు సమాచారం ఇవ్వడంతో మంగళవారం పోలీసులు నేరుగా దాడి చేయగా ముగ్గురు వ్యక్తులను అదుపులో తీసుకున్నారు. స్థానికులు సమాచారం ప్రకారం గత ప్రభుత్వంలో మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మంగా పేదలకు కేటాయించిన జగనన్న కాలనీలో ఇటువంటి వ్యభి చార గృహాలు నడపడం చాలా దారుణమని రాత్రులు మద్యం, గంజాయి సేవించి అరుపులు కేకలతో భయభ్రాంతులకు గురి చేస్తున్నారని స్థానిక కాలనీవాసులు వాపోతున్నారు. గోవ లంక గ్రామానికి చెం దిన ఒక వ్యక్తి విక్రయించిన ఇంటిలో ఈ బాగోతం జరుగుతున్నట్లు ఆరోపిం చారు. నిర్వాహకురాలు గంజాయి కూడా విక్రయిస్తున్నట్లుగా గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మందుబాబుల ఆగడాలు తట్టుకోలేక ఇప్పటికే పలువురు ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పం దించి అటువంటి వారిని కాలనీలో ఉండకుండా ఖాళీ చేయించి మాకు రక్షణ కల్పించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై కాకినాడ రూరల్ సీఐ డి చైతన్య కృష్ణ , ఎస్ఐ పి సత్య నారాయణ స్వయంగా విచారణ చేపట్టి కేసు నమోదు చేశారు.

రెండు బైకులు ఢీకొని వ్యక్తి మృతి, ఒకరికి గాయాలు

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మం డలం ధర్మవరం జాతీయ రహ దారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి. గొల్లప్రోలు మం డలం చందుర్తి గ్రామానికి చెందిన సిద్ధాంతపు ముసలా రావు (52) మోటార్ సైకిల్ పై ధర్మవరం బయలుదేరాడు. అదే మార్గంలో వస్తున్న మరో బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో ముసలారావు మృతిచెందగా, పొన్నాడ హరి గంగాధర గాయ పడ్డాడు. అదే సమయానికి ఏలేరు రిజర్వాయర్ సందర్శన ముగించుకుని అటుగా వెళుతున్న జిల్లా కలెక్టర్ సన్మోహన్ సగిలి వెంటనే స్పందించి తన ప్రోటోకాల్ వాహనంలో కలెక్టర్ గన్ మెన్ ప్రత్తిపాడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిం చారు. ఆ ప్రాంతవాసులు జిల్లా కలెక్టర్ స్పందించిన తీరుపట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రమాదంలో ముసలారావు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈమేరకు ప్రత్తిపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంకటస్థితిలో మద్యం దుకాణాల సిబ్బంది

విశాలాంధ్ర - కొవ్వూరు : ఏపీ ప్రభుత్వం అక్టోబర్ 1 నుంచి నూతన మద్యం పాలసీ విధానాన్ని తీసుకురానుందా?, ఈ విధానం మద్యం దుకాణ సిబ్బందిపై తీవ్ర ప్రభావం చూపనుందా?, దీంతో వేల కుటుంబాలు రోడ్డున పడనున్నాయా ? టెండర్ విధానం అమల్లోకి వస్తే వారంతా ఇంటికెళ్లక తప్పదా ?, అంటే అవుననే సమాధానం వస్తోంది. వైఎస్సీపీ ఓటమితో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పని చేసే సిబ్బంది సంకటస్థితిలో పడ్డారు. కొత్త మద్యం పాలసీ అమల్లోకి రావడం వంటి పరిణామాల నేపథ్యంలో వేల మంది సిబ్బంది ఉద్యోగాలు ఊడిపోనున్నాయి. దీంతో ఐదేళ్ల పాటు వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆదాయం పెంచడంలో కీలక పాత్ర పోషించిన వీరికి ఆ ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించకపోవడం దురదృష్టకరం. ఈ క్రమంలో ప్రభుత్వ తీరును సమర్థిస్తూ తమకు న్యాయం చేయాలని కోరుతూ ఈ నెల 4 నుంచి ఆందోళన బాట చేపడతారని సమాచారం. మద్యం షాపులలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించడంలో గత ప్రభుత్వం విఫలం అయ్యిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కొవ్వూరు నియోజకవర్గం చాగల్లులో ప్రభుత్వ మద్యం డిపో ఉంది దీని పరిధిలో 117 షాపులు పనిచేస్తున్నాయి. అదేవిధంగా వందలాదిమంది సిబ్బంది పనిచేస్తున్నారు. 2019లో వైసీపీ అధికారంలోకి రాగానే అప్పటి వైసీపీ ప్రభుత్వం మద్యం దుకాణాలకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా మద్యం దుకాణాల్లో ఇంటర్, డిగ్రీ, పీజీ చదివిన అర్హత ఉన్న వారికి దుకాణంలో ఉద్యోగులుగా నియమించింది. అయితే వీరిని కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ విధానం ద్వారా ఎంపికి చేసి ఉద్యోగాలు ఇచ్చారు. నిబంధనలు ప్రకారం ఈ ఉద్యోగులు ఎనిమిది గంటలు పని చేయాల్సి ఉండగా వీరితో 12 గంటలసేపు పని చేయించింది. కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ విధానం కావడంతో ఉద్యోగులు ఏమీ అనకుండా పనిచేశారు. ఐదేళ్లపాటు ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూర్చి తక్కువ జీతమైన కుటుంబాలను పోషించుకుంటూ వచ్చామని, ఇప్పుడు హఠాత్తుగా తమను తొలగిస్తే తమ పరిస్థితి ఏమిటి అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సచివాలయాల్లోని ఉద్యోగులను వేరే శాఖలలో సర్దుబాటు చేస్తున్నామని ప్రభుత్వం ప్రకటించినవిధంగా తమ అర్హతలను బట్టి కొత్త ప్రభుత్వం తమను ఇతర శాఖలోకి సర్దుబాటు చేయాలని కోరుతున్నారు.

నగరంలో రెండు పునరావాస కేంద్రాలు ఏర్పాటు

- రాజమండ్రి ఆర్డీవో పర్యవేక్షణలో మూడు లంక గ్రామాల నుంచి 228 మంది తరలింపు
- కలెక్టర్ ప్రశాంతి

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం రూరల్ : గోదావరి ఎగువ ప్రాంతాల్లో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు నేపథ్యంలో ధవళేశ్వరం బ్యారేజీకి పెద్ద ఎత్తున వరద నీరు చేరడంతో ముందస్తు భద్రత చర్యల్లో భాగంగా మూడు లంక గ్రామాల్లోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించినట్లు జిల్లా కలెక్టర్ ప్రశాంతి బుధవారం రాత్రి ఒక ప్రకటనలో తెలియజేశారు.

భద్రాచలం నీటిమట్టం 44.40 అడుగులు చేరడంతో దిగువ ప్రాంతానికి నీటిని విడుదల చేయడం జరుగు తుందని ఆ నేపథ్యాన్ని దృష్టిలో ఉంచుకుని గోదావరి పరివాహక ప్రాంతాల్లోని లంక గ్రామాల ప్రజలను ముంద స్తుగా సురక్షిత ప్రాంతాలకు తరలించామని తెలిపారు. ప్రస్తుతం ధవళేశ్వరం బ్యారేజ్ నుంచి రాత్రి 8 గంటల సమయంలో 7,14,614 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశామన్నారు. వరద నీరు పెరిగే హెచ్చరికల నేపథ్యంలో మర బోట్లు ఏర్పాటు చేసి గోదావరి నది లంక గ్రామాల్లో బ్రిడ్జి లంక నుంచి 108 మందిని, కేతా వారి లంక, వెదురులంక నుంచి 120 మందినీ రాజ మహేంద్రవరంలో రెండు పునరావాస కేంద్రాలకు తర లించి వసతి కల్పించడం జరిగిందన్నారు. బ్రిడ్జిలంక కు చెందిన 108 మందిని ఆల్కట్ గార్డెన్ లోని మునిసిపల్ కళ్యాణ మండపంకి, కేదారి వారిలంక, వెదురులంక లకు చెందిన 120 మందిని చందా సంత్రానికి తరలించామని అన్నారు. వారికి భోజన సదుపాయంతో పాటు, మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పునరా వాస కేంద్రాలకు తరలించే ప్రక్రియను రాజమహేంద్ర వరం ఆర్డీఓ కేఎల్ శివ జ్యోతి, జిల్లా ఫైర్ ఆఫీసర్ ఎం మార్టిన్ లూథర్ కింగ్, ఫిషరీస్ అధికారి కె వి కృష్ణారావు, నగర పాలక సంస్థ అధికారులు పర్యవేక్షించారని తెలిపారు.

ఏఐటీయూసీకి రాజమండ్రి జట్ల సంఘం రూ50,000 విరాళం అందజేత

విశాలాంధ్ర- రాజమహేంద్రవరం: ఏఐటీయూసీ రాష్ట్ర కేంద్రానికి రాజమండ్రి జట్లు లేబర్ యూనియన్ 50 వేల రూపాయల విరాళంను ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి ఓబులేసుకు అందజేసింది. ఈ సందర్భంగా జి ఓబులేసు మాట్లాడుతూ దేశంలో రాష్ట్రంలో ఏఐటియుసి ఎటువంటి కార్యక్రమాలు నిర్వహించిన జట్లు లేబర్ యూనియన్ ఉదారంగా సాయం అందజేస్తుందని వారికి ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీ ధన్యవాదములు తెలియజేస్తుందిన్నారు. విరాళం అందజేసిన వారిలో సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, జట్లు లేబర్ యూనియన్ అధ్యక్షులు కుంద్రపు రాంబాబు ప్రధాన కార్యదర్శి సప్ప రమణ, సీపీఐ నగర కార్యదర్శి వి కొండలరావు సంఘం అధికారి బాడీ సభ్యులు దేవుడు బాబు, వెంకటరావు, దుర్గ ప్రసాద్ కాళ్ల అప్పలనాయుడు తదితరులు ఉన్నారు.

తప్పిపోయిన మూడేళ్ల బాలుడిని అరగంటలో తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : మూడు సంవత్సరాల బాలుడు ఇంటి నుంచి తప్పిపోయిన అరగంట వ్యవధిలో ఏలూరు త్రీ టౌన్ పోలీసులు వారి తల్లిదండ్రుల చెంతకు చేర్చడంతో పోలీసుల సేవలను పలువురు అభినందించారు. ఏలూరు 3 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న మినీ బైపాస్ రోడ్డులో బుధవారం ఉదయం 11:30 గంటలకు పోసుపల్లి హర్ష అనే మూడేళ్ల బాలుడిని స్థానికులు గుర్తించి వెంటనే త్రీటౌన్ సిఐ కోటేశ్వరరావుకు సమాచారం అందించారు. దీంతో సీఐ బాలుడి తల్లిదండ్రుల ఆచూకీ కోసం మహిళా కానిస్టేబుల్ సుజాత ద్వారా ప్రయత్నించారు. మహిళా కానిస్టేబుల్ ఆ ప్రాంత ఏఎన్ఎం ద్వారా బాలుడి ఆచూకీ తెలుసుకునేందుకు ప్రయత్నించి చివరకు ఏలూరు వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల గొల్లాయిగూడెం ప్రాంతంలో బాలుడి తల్లిదండ్రులు నివాసం ఉంటున్నట్లు గుర్తించారు. దీంతో వెంటనే సచివాలయ సిబ్బంది ద్వారా బాలుడి తండ్రి రాజుని పిలిపించి సిఐ కోటేశ్వరరావు సమక్షంలో తప్పిపోయిన బాలుడిని అప్పగించారు. దీంతో బాలుడు హర్ష తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తూ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - పెరవలి : ప్రస్తుతం వర్షాలు కురుస్తుం డటం వలన ఇంటి పరిసరాల్లో మురుగు నీరు నిల్వ ఉండటం వల్ల దోమలు పెరిగి దోమ కాటు వల్ల వచ్చే వ్యాధులు ప్రభలే అవ కాశం ఉందని కానూరు ప్రాథ మిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కే హేమరాజు అన్నారు. వర్షపు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని అన్నారు.బుధవారం మునిపల్లి సచివాల యం పరిధిలో ఉన్న కొత్తపేట ఎస్సి ఏరియాలో వైద్య సిబ్బందిచే ఫీవర్ సర్వే నిర్వహించి జ్వరాలు ఉన్నవారిని గుర్తించి వారిని వైద్య శిబిరంలో చికిత్స, రక్తపరీక్షలు చేసి వారికి మందులు ఇస్తున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభలే సీజనల్ వ్యాధులపై ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని ఎప్పటికప్పుడు వైద్య సిబ్బంది సలహాలను పాటించాలని సూచించారు.

ముంపు ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- కొల్లేరు వరద తగ్గేవరకు ఎవరూ బయటకు రావొద్దు
- వరద ప్రభావ గ్రామాల్లో మెడికల్ క్యాంపు ఏర్పాటు
- జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, ఎస్పీ

విశాలాంధ్ర - కైకలూరు : ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలు, కృష్ణానది, బుడమేరు నుంచి వస్తున్న జలప్రవాహాలతో కొల్లేరు సరస్సుకు వరదముంపు పొంచివున్నందున ముంపునకు గురయ్యే ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయడానికి జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, జిల్లా ఎస్.పి. కె. ప్రతాప్ శివకిషోర్, ఏలూరు రూరల్ మండలం కోమటిలంక గ్రామం వద్ద వరద పరిస్థితిని పరిశీలించారు. అక్కడ ప్రజల సమస్యలను గ్రామ సర్పంచ్, కొల్లేరు సరస్సు అధ్యక్షులు, గ్రామ పెద్దలు, ప్రజలతో కలెక్టర్ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కృష్ణానది వరద నీరు పెరుగుతున్న దృష్ట్యా కొల్లేరు వరద ప్రాంతాల ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోను రెండు రోజులపాటు గ్రామాల్లోనే వారి నివాసాల్లోనే ఉండాలని బోట్లు ద్వారా ప్రయాణం నిషేధించామని తెలిపారు. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ కోమటిలంకకు సంబంధించిన రోడ్డు నిర్మాణానికి గతంలో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపి నిధులు మంజూరు చేయించానని, ఫారెస్టు డిపార్ట్మెంట్ వారి అనుమతులు లేనందున పనులు జరగలేదని దీనిని దృష్టిలో పెట్టుకొని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో చర్చించి పనులు ప్రారంభించాలని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి దృష్టికి తీసుకువచ్చారు. జిల్లా ఎస్.పి. కె. ప్రతాప్ శివకిషోర్ మాట్లాడుతూ గ్రామాల్లో వీఆర్ఓలతో పాటు పోలీస్ సిబ్బంది కూడా గ్రామాల ప్రజలు బోట్లుమీద ప్రయాణించకుండా పర్యవేక్షణ చేస్తారని తెలిపారు. అనంతరం మండవల్లి మండలం పెద్దఎడ్లగాడి, మలుగునూరు వంతెన వద్ద కొల్లేరు వరద నీటికి అడ్డుగా వున్న గుర్రపుడెక్కను ఇరిగేషన్ శాఖ వారు ప్రొక్లెన్ ద్వారా తొలగించే పనులను కలెక్టర్ పరిశీలించారు. బుడమేరు నుంచి వచ్చే వరదనీరు పెరుమలంక నందిగాయిలంక, శ్రీరామ్ నగర్, ఇంగిలిపాక, గ్రామాలకు వెళ్లే రహదారులు జలదిగ్బంధంలో ఉండటం వల్ల రాకపోకలు నిలిచిపోయాయని గ్రామ ప్రజలు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ గ్రామాల్లో కూడా మెడికల్ క్యాంపులు, నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని మండల తహశీల్దార్ ను కలెక్టర్ ఆదేశించారు. ఇరిగేషన్, రెవెన్యూ, ఫారెస్టు, పోలీస్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి వరద వల్ల ఎటువంటి ప్రాణ నష్టం జరుగకుండా పనిచేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డిఓ ఎన్ఎస్ కె ఖాజావలి, ఇన్ చార్జి తహశీల్దార్ శ్రీనివాసరావు, యంపిడివో బంది ప్రణవీ, ఇరిగేషన్, పోలీస్,ఫారెస్టు అధికారులు, గ్రామ పెద్దలు తదితరులు ఉన్నారు

వరద బాధితులకు పశ్చిమగోదావరి జిల్లా ఆపన్నహస్తం

విశాలాంధ్ర - భీమవరం : విజయవాడ ప్రాంతవాసులు అకాల వరదలలో చిక్కుకోవడంతో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయిడు ఆదేశాల మేరకు పశ్చిమగోదావరి జిల్లా నుండి వారికి పెద్ద ఎత్తున ఆపన్న హస్తం అందింది. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి చొరవతో దాతలు తమదైన శైలిలో ముందడుగు వేసారు. కలెక్టర్ కోరిందే తడవుగా పలువురు ముందుకు వచ్చి తమ ఔదార్యతను చాటుకున్నారు. వరద సహాయ చర్యల్లో భాగంగా జిల్లా నుండి మూడు రోజులుగా (సోమ, మంగళ, బుధ వారాలు) 2,81,900 ఆహార పొట్లాలు, 95,640 వాటర్ ప్యాకెట్లు, 1.25 లక్షల బిస్కెట్ ప్యాకెట్లు, అర లీటర్ వాటర్ బాటిల్స్ 28,100, 30 వేల రొట్టెలు, 22 వేల రస్కుల ప్యాకెట్స్, 9 వేల జామకాయలు విజయవాడ చేరాయి. వివిధ స్వచ్ఛంద సంస్థలు, వ్యాపారవేత్తలు, సంఘాలు, విద్యాసంస్థలు, పారిశ్రామిక సంస్థలు, ఆహార ప్రాసెసింగ్ కంపెనీలు సహకారంతో గత మూడు రోజులుగా వీటిని విజయవాడకు ప్రత్యేక వాహనాల ద్వారా పంపామని ఈ సందర్భంగా చదలవాడ నాగరాణి తెలిపారు. బుధవారం 82, 940 ఆహార పొట్లాలు, 25,640 వాటర్ ప్యాకెట్లు, 29,100 ఆఫ్ లీటర్ వాటర్ బాటిల్స్, 16 వేల రొట్టెలు, పదివేల బిస్కెట్ ప్యాకెట్లు, 9 వేల జామకాయలు, 5 వేల అరటిపళ్ళు విజయవాడకు పంపామన్నారు.

విజయవాడలో సహాయక చర్యలు ముమ్మరం

విశాలాంధ్ర - రాజానగరం,సీతానగరం: ప్రకృతి విలయంతో వరద ముంపునకు గురైన విజయవాడ వాసులకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పెద్ద ఎత్తున సహాయక చర్యలు ముమ్మరం చేసిందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డు వెంకట రమణ చౌదరి అన్నారు. ఈ సందర్భంగా విశాలాంధ్రతో చరవాణిలో బుధ వారం మాట్లాడుతూ ఉమ్మడి గోదావరి జిల్లాలోని రాజమండ్రి పార్లమెంటు,రాజానగరం నియోజకవర్గం నుండి అధిక సంఖ్యలో తమ పార్టీ నాయకులు, కార్యకర్తలు విపత్కర పరిస్థితుల్లో స్వచ్ఛందంగా ముందుకు వచ్చి వరద బాధితులకు ఆహార, పానీయా లు అందిస్తున్నట్లు చెప్పారు.అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు మేరకు వైద్య సేవలు ఎప్పటికపుడు సిద్ధం చేశారని చెప్పారు. ఆయన వెంట టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే విజయవా డలోని సింగ్ నగర్లో మోలలోతు నీటిలో వరద సహాయక చర్యల్లో నియోజకవర్గ ఎమ్మెల్యే బత్తుల బలరామ కృష్ణ బుధవారం పాల్గొన్నారు. ఇందుకు సంబంధించి స్థానిక విలేకర్లుకు పత్రిక ప్రకటనను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధక్షులు పల్లా శ్రీనివాస్ సంయుక్త ఆదేశాల మేరకు సింగ్ నగర్లో పిల్లలు వృద్దులు,మహిళలు,ప్రజలను ట్రాక్టర్, జెసిబి సహాయం తో సురక్షిత ప్రాంతాలకు తరలించమన్నారు. దీనిలో భాగంగా బాధితులకు ఆహారం, మంచినీళ్లు,పాలు, బిస్కట్లు అందజేశారు.వరదల్లో నష్టపోయిన ప్రతిఒక్క రిన్నీ కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని భరోసా కల్పించారు.